చిగురిస్తున్న ఆశలు



హనుమకొండ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖ సమీక్షలో భాగంగా ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి త్వరలో మెగా డీఎస్సీని నిర్వహించనున్నట్టు ప్రకటించడంతో ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయ శిక్షణను పూర్తి చేసిన అభ్యర్థుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇందులో భాగంగా సుమారు 9,800 ఉపాధ్యాయ పోస్టులతో ప్రభుత్వం ఈ మెగా డీఎస్సీ నిర్వహించే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. గత ఆగస్టులో రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 5089 స్కూల్ అసిస్టెంట్, సెకండరీ గ్రేడ్ టీచర్స్, భాషా పండితులు పోస్టులను భర్తీకి నోటిఫికేషన్ కూడా విడుదల చేసింది. ఈ పోస్టులకు ఉమ్మడి జిల్లాలో 36 వేలకు పైగా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. కానీ నియామకాలు మాత్రం జరగలేదు. దీంతో తీవ్ర నిరాశకు లోనైన నిరుద్యోగులు తాజాగా రేవంత్ రెడ్డి ప్రకటనతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కొత్త ప్రభుత్వం ఎప్పుడు డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసినా పరీక్షలకు హాజరయ్యేందుకు మరో సారి సిద్ధమవుతున్నారు.

మరోసారి సన్నద్ధం

గత కొన్ని సంవత్సరాలుగా టీఆర్టీ, డీఎస్సీ నిర్వహించకపోవడంతో వేలాది ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 2017లో టీఆర్టీని చివరి సారిగా నిర్వహించారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహణకు అడుగులు వేస్తుండడంతో ఉమ్మడి జిల్లాలో డీఎడ్, బీఎడ్ శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులు కొలువులే లక్ష్యంగా మరో సారి పుస్తకాలతో కుస్తీ పట్టేందుకు సన్నద్ధం అవుతున్నారు. వేలాది మంది నిరుద్యోగులు గ్రామాలను వదిలిపెట్టి పరీక్షల సన్నద్ధతకు నగరానికి వస్తున్నారు.

షెడ్యూల్‌తో సరి

గత ప్రభుత్వ హయాంలో సెప్టెంబరు 9న ఆయా జిల్లాల ఎంపిక కమిటీలు (డీఎస్సీ) ఆధ్వర్యంలో ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ) పేరిట నోటిఫికేషన్ విడుదల చేసింది. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ అక్టోబరులో ముగియగా నవంబరు 20 నుంచి 30 వరకు ఆన్‌లైన్ విధానంలో పరీక్షల నిర్వహణకు రాత పరీక్షలకు షెడ్యూల్ విడుదల చేసింది. కానీ ఎన్నికల దృష్ట్యా ఆ పరీక్షలు వాయిదా పడ్డాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓడిపోయింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. సీఎంగా బాధ్యతలు చేపట్టిన రేవంత్ రెడ్డి ఆ వెంటనే విద్యాశాఖపై సమీక్ష నిర్వహించారు. బడులులేని గ్రామాలు ఉండరాదనీ, మూతపడిన బడులను తిరిగి తెరిపించాలని, ఆదేశించారు. వీటితో పాటు నిలిచిపోయిన టీచర్ల పదోన్నతులను చేపట్టాలని సూచించారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీని నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలపై పూర్తి వివరాలు పంపాల్సిందిగా జిల్లా విద్యాశాఖ అధికారులకు తాజాగా ఆదేశాలు జారీ అయ్యాయి. ఉపాధ్యాయ పదోన్నతులపై కూడా ప్రభుత్వం దృష్టి సారించడంతో పాటు, మూతపడిన బడులను తిరిగి తెరిచేలా చర్యలు ప్రారంభించడంతో ఉపాధ్యాయ పోస్టులు మరిన్ని పెరిగే అవకాశాలు ఉన్నాయి. గత ప్రభుత్వం ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్ రద్దు చేస్తే పలు సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశాలు ఉన్నాయనీ విద్యాశాఖ భావిస్తోంది. దీంతో ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో భర్తీ చేయాలని నిర్ణయించిన 532 పోస్టులతో కలిపి అనుబంధ నోటిఫికేషన్‌ను జారీ చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

- త్వరలో మెగా డీఎస్సీ
- ఉమ్మడి జిల్లాలో 532 ఉపాధ్యాయ ఖాళీలు
- పోస్టులు మరిన్ని పెరిగే అవకాశం
- పరీక్షలకు మళ్లీ సన్నద్ధం అవుతున్న అభ్యర్థులు
- ముందు టెట్, ఆ తర్వాత డీఎస్సీ

ఖాళీ పోస్టులు 532

ఉమ్మడి జిల్లాలో స్కూల్ అసిస్టెంట్లు, భాషాపండితులు, వ్యాయామ ఉపాధ్యాయులు, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు కలిపి మొత్తం 532 పోస్టులు ఉన్నాయి. హనుమకొండలో మొత్తం 54 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిలో స్కూల్ అసిస్టెంట్ 21, భాషాపండితులు 5, వ్యాయామ ఉపాధ్యాయులు 7, సెకండరీ ఉపాధ్యాయులు 21 ఉన్నాయి. జయశంకర్ భూపాలపల్లిలో మొత్తం 74 పోస్టులు ఖాళీగా ఉండగా వీటిలో స్కూల్ అసిస్టెంట్ 12, భాషా పండితులు 17, వ్యాయామ ఉపాధ్యాయులు 7, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు 38 ఖాళీగా ఉన్నాయి. జనగామ జిల్లాలో మొత్తం 76 ఖాళీలు ఉండగా వీటిలో స్కూల్ అసిస్టెంట్లు 23, భాషా పండితులు 17, వ్యాయామ ఉపాధ్యాయులు 7, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల ఖాళీలు 29 ఉన్నాయి. కాగా, ములుగు జిల్లాలో మొత్తం 65 ఖాళీల్లో స్కూల్ అసిస్టెంట్లు 16, భాషా పండితులు 15 ఉన్నాయి. వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టుల ఖాళీలు ఏమీ లేవు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ పోస్టులు మాత్రం 33 ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లాలో మొత్తం 125 ఉపాధ్యాయ ఖాళీలు ఉండగా వీటిలో స్కూల్ అసిస్టెంట్లు 35, భాషా పండితులు 19, వ్యాయామ ఉపాధ్యాయులు 2, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు 65 ఉన్నాయి. వరంగల్ జిల్లాలో మొత్తం 138 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిలో స్కూల్ అసిస్టెంట్లు 56, భాషా పండితులు 21, వ్యాయామ ఉపాధ్యాయులు 6, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల ఖాళీలు 55 ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 5089 పోస్టులు ఖాళీగా ఉన్నట్టు గత సంవత్సరం ఆగస్టులో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. వీటిలో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 1739, భాషా పండితులు 611, వ్యాయామ ఉపాధ్యాయులు 164, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు 2575 ఉన్నాయి.

ముందు టెట్

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) అర్హత సాధిస్తేనే డీఎడ్, బీఎడ్ పూర్తి చేసిన అభ్యర్థులు డీఎస్సీ రాయవచ్చు. మెగా డీఎస్సీ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుండడంతో వేలాది మంది నిరుద్యోగులకు మేలు జరిగేలా తొలుత టెట్‌ను, ఆ తర్వాత డీఎస్సీని నిర్వహించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు విద్యాశాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది. వచ్చే విద్యా సంవత్సరం నాటికి నియామక ప్రక్రియ ముగిసేలా కసరత్తు మొదలైంది. ఇప్పటికే పలు దఫాలుగా గత ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టులపై చేసిన ప్రకటనలతో చాలా మంది అభ్యర్థులు నెలల తరబడి సన్నద్ధమవుతున్నారు. గత సెప్టెంబరులో నిర్వహించిన టెట్ పరీక్షకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 36,923 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలో 40 శాతం మంది అర్హత సాధించారు. వీరికి తోడు ఇది వరకే టెట్ అర్హత సాధించి ఉద్యోగాలకు ఎంపిక కానీ వారు మరో 6వేలకుపైగా ఉన్నారు. దీనితో ఉపాధ్యాయ పోస్టుల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 25 వేల మంది వరకు ఉన్నట్టు అంచనా.



ప్రజా పాలన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

అధికారులు సమస్యలపై దృష్టి సారించాలి

- 'ప్రజా పాలన' సదస్సులో కలెక్టర్ ప్రావీణ్య

వర్ధన్నపేట రూరల్, జనవరి 3 : గ్రామీణ స్థాయిలో అధికారులు ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. వర్ధన్నపేట మండలంలోని కడారిగూడెం గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రజా పాలన సదస్సును సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఆరు గ్యారంటీలకు వస్తున్న దరఖాస్తులను కలెక్టర్ పరిశీలించారు. అభయహస్తం పేరుతో ప్రజా పాలనకు దరఖాస్తు చేసుకునే వారు అధికారుల సూచనలు పాటించాలని అన్నారు. పథకాల పట్ల ఎలాంటి అపోహలకు గురికాకుండా దరఖాస్తు చేసుకోవాలని, అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వం సంక్షేమ పథకం అందేలా చూస్తామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు దరఖాస్తులను స్వీకరించాలని ఆదేశించారు. ఉచితంగానే దరఖాస్తులు లభిస్తాయని, కొనుగోలు చేయకూడదని స్పష్టం చేశారు. అనంతరం గ్రామంలో పలు సమస్యలను అడిగి తెలుసుకుని, పలువురి దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్యను స్థానిక మహిళలు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్డీవో వాసుచంద్ర, ఎంపీపీ అప్పారావు, జడ్పీటీసీ మార్గం భిక్షపతి, సర్పంచ్ సతీష్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ప్రజా పాలన కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి వర్ధన్నపేట మండల స్థాయి అధికారులు చురుగ్గా పాల్గొనడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సమావేశాల వద్ద కనీస సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తా..

- డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ



డీఎంహెచ్‌వోను సన్మానిస్తున్న దృశ్యం

వరంగల్ కలెక్టరేట్, జనవరి 3 : వైద్య, ఆరోగ్య శాఖకు సంబంధించిన ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తానని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కె.వెంకటరమణ అన్నారు. బుధవారం జిల్లా కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వ ఫార్మాసిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు, ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు బత్తిని సుదర్శన్‌గౌడ్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. డీఎంహెచ్‌వోను శాలువాలతో సత్కరించి బొకేలను అందజేశారు. ఈ సందర్భంగా సుదర్శన్‌గౌడ్ మాట్లాడుతూ జిల్లాలో పని చేస్తున్న ఆరోగ్య శాఖ ఉద్యోగులు నేషనల్ హెల్త్ ప్రోగ్రాంలు, స్టేట్ హెల్త్ ప్రోగ్రాంలు అన్ని విజయవంతం చేసి రాష్ట్ర స్థాయిలో వరంగల్ జిల్లాను ముందంజలో ఉంచుటకు కృషి చేయాలన్నారు. అలాగే జిల్లాలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటిని పరిష్కరించాలని కోరారు. డీఎంహెచ్‌వో కె.వెంకటరమణ మాట్లాడుతూ జిల్లాలో ఉద్యోగుల సమస్యలు తన దృష్టికి వచ్చినట్లయితే వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ మంచిక ప్రమోద్‌కుమార్‌గౌడ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.గోపాల్‌రావు, డిప్యూటీ డెమోలు ఈదుల అనిల్‌కుమార్, నవీన్ రాజ్‌కుమార్, రాధిక, మేరి, విజయలక్ష్మి, రజినీకాంత్, మనోజ, సృజన, సుధ, రాణి, సరళారాణి, పృథ్వీ, నేహ, సరిత, శ్వేత, మధు, శోభ, షమీమ్ పాల్గొన్నారు.

మహిళ దారుణ హత్య

- తల్లి ప్రాణాలను బలిగొన్న కొడుకు వివాహేతర సంబంధం
- భూపాలపల్లి జిల్లాలో ఘటన



పద్మ మృతదేహం (ఇన్‌సెట్‌లో ఫైల్)

మహదేవపూర్ రూరల్, జనవరి 3 : కొడుకు పెట్టుకున్న వివాహేతర సంబంధం తల్లి హత్యకు దారి తీసింది. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలో ఈ సంఘటన బుధవారం ఉదయం చోటుచేసుకుంది. ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... అంబట్‌పల్లికి చెందిన నల్లా పద్మ, భూమయ్య దంపతుల కుమారుడు అవినాష్ అదే గ్రామానికి చెందిన మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. కొంతకాలంగా ఈ వ్యవహారం నడుస్తుండగా ఆ మహిళ భర్త పుట్టా నర్సింహస్వామికి విషయం తెలిసింది. దీంతో కోపోద్రిక్తుడైన అతడు అవినాష్‌ను మట్టుబెట్టాలని ప్లాన్ చేశాడు. బుధవారం ఉదయం గ్రామంలోని అమరేశ్వరాలయం వద్ద అవినాష్ ఉన్నాడని తెలుసుకొని గొడ్డలితో అక్కడికి చేరుకున్నాడు. అవినాష్‌పై దాడి చేసేందుకు యత్నించగా అయ్యప్ప భక్తులు అడ్డుకున్నారు. నర్సింహస్వామి బారి నుంచి తప్పించుకున్న అవినాష్ అక్కడి నుంచి పరారయ్యాడు.

ఈ క్రమంలో కోపం చల్లారని నర్సింహస్వామి అదే గొడ్డలితో అతడి ఇంటికి వెళ్లాడు. అవినాష్ ఇంటికి వచ్చి ఉంటాడని భావించి బయట నుంచి కేక వేశాడు. ఆ సమయంలో అవినాష్ ఇంట్లో లేడు. అతడి తల్లి నల్లా పద్మ(40) బయటకు వచ్చి చూడగా నర్సింహస్వామి గొడ్డలితో ఉన్నాడు. ఎందుకిలా వచ్చావని పద్మ అడిగింది. అవినాష్‌ను హత్య చేయడానికి వచ్చానని నర్సింహస్వామి సమాధానం చెప్పాడు. 'ఎందుకు చంపాలనుకుంటున్నావు.. నా కొడుకు ఏం చేశాడు?' అని పద్మ అడుగుతుండగానే నర్సింహస్వామి ఆమెపై అదే గొడ్డలితో దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. దీంతో ఆమె కుప్పకూలి అక్కడే ప్రాణాలు వదిలింది. మృతురాలి భర్త భూమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. నిందితుడు నర్సింహస్వామి పరారీలో ఉన్నాడని చెప్పారు. పద్మ, భూమయ్య దంపతులు అంబట్‌పల్లిలోనే మిర్చి బండి నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి అవినాష్‌తోపాటు కూతురు ఉంది. అవినాష్ అవివాహితుడు కాగా ప్రైవేటు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నిందితుడు నర్సింహస్వామి అదే గ్రామంలో టెంట్‌హౌస్ నిర్వహిస్తున్నాడు.

బీఆర్ఎస్‌కు కార్పొరేటర్ల గుడ్‌బై

- కాంగ్రెస్‌లో చేరిన ఆరుగురు
- మాజీ కార్పొరేటర్లు సైతం హస్తం గూటికి..
- కండువా కప్పి ఆహ్వానించిన దీపాదాస్ మున్షీ
- నాయిని నేతృత్వంలో ముఖ్యమంత్రితో భేటీ
- త్వరలో తూర్పు, వర్ధన్నపేట కార్పొరేటర్లు సైతం..



సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన బల్దియా కార్పొరేటర్లు

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 3 : బీఆర్ఎస్ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు ఆ పార్టీకి గుడ్ బై చెబుతున్నారు. ఒక్కొక్కరుగా గులాబీ వనం నుంచి హస్తం గూటిలోకి చేరుతున్నారు. ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్ బీఆర్ఎస్‌ను వీడారు. ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఈ క్రమంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు అధికార పక్షం వైపు మళ్లారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన ఆరుగురు కార్పొరేటర్లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వీరితో పాటు మాజీ కార్పొరేటర్లు, నాయకులు బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ఆహ్వానంతో కాంగ్రెస్‌లో చేరారు.

ఈ పరిణామాలు కాంగ్రెస్‌లో జోష్‌ను కలిగిస్తుండగా జంప్ జిలానీలతో గులాబీ గూటిలో నిస్తేజం అలుముకుంది. గులాబీ కార్పొరేటర్లను నిలువరించేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌తో పాటు మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, నన్నపునేని నరేందర్, అరూరి రమేశ్‌లతో పాటు మేయర్ గుండు సుధారాణి ప్రయత్నించినా బీఆర్ఎస్ కార్పొరేటర్లు స్పందించనట్టు తెలిసింది.

ఫలించిన నాయిని వ్యూహం...

వరంగల్ పశ్చిమకు చెందిన బీఆర్ఎస్ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు ఇతర నాయకులు కాంగ్రెస్‌లోకి రావడంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి వ్యూహం ఫలించింది. చేరిన వారిలో కొందరు ఎన్నికలకు ముందే రాజేందర్‌రెడ్డితో టచ్‌లో ఉన్నారు. వ్యూహాత్మకంగానే ఈ పరిణామం వాయిదా పడుతూ వచ్చింది. ఎన్నికలు ముగిశాయి చేరికలకు లైన్ క్లియర్ అయ్యింది. ఈ విషయానికి సంబంధించి బీఆర్ఎస్ కార్పొరేటర్లు, రాజేందర్‌రెడ్డిల మధ్య మంతనాలు వారం రోజులుగా జరిగాయి. బుధవారం పార్టీ సమావేశానికి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ హాజరు కానుండడంతో చేరికకు రాజేందర్‌రెడ్డి ముహుర్తం ఫిక్స్ చేశారు. అంతా చకచకా జరిగిపోయింది. దీపాదాస్ మున్షీ కండువాలు కప్పడం ఆ తదుపరి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో భేటీ కావడంతో గులాబీలు కాంగ్రెస్ వేదికపైకి వచ్చారు.

కండువా కప్పిన దీపాదాస్ మున్షీ

కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు ఇతర బీఆర్ఎస్ నేతలకు కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ కండువా కప్పి ఆహ్వానించారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన పార్టీ కార్యనిర్వాహక సమావేశం అనంతరం చేరికల కార్యక్రమం జరిగింది. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేరిన బీఆర్ఎస్ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, నేతలను దీపాదాస్ మున్షీ కండువాలతో ఆహ్వానించి శుభాకాంక్షలు

మిగతా 8వ పేజీలో..

కాంగ్రెస్‌లో చేరిన ఆరుగురు 'గులాబీ' కార్పొరేటర్లు

వరంగల్ పశ్చిమకు చెందిన ఆరుగురు కార్పొరేటర్లు మామిండ్ల రాజు (31వ డివిజన్), మానస రాంప్రసాద్ (49వ డివిజన్), వేముల శ్రీనివాస్ (7వ డివిజన్), చీకటి శారద ఆనంద్ (9వ డివిజన్), నెక్కొండ కవిత కిషన్ (50వ డివిజన్), సర్తాజ్ బేగం (48వ డివిజన్) కాంగ్రెస్‌లో చేరారు. వీరితో పాటు మాజీ కార్పొరేటర్లు తాడిశెట్టి విద్యాసాగర్, వీరగంటి రవీందర్, వేల్పుల మోహన్‌రావు, నెక్కొండ కిషన్, అబూబాకర్, బీఆర్ఎస్ నాయకులు చీకటి ఆనంద్, నలుబోల సతీశ్ కాంగ్రెస్ గూటికి చేరారు.

గ్రేటర్‌పై గురి

- బీఆర్ఎస్ కార్పొరేటర్లకు వల వేస్తున్న కాంగ్రెస్
- బీజేపీ కార్పొరేటర్లకు సైతం టచ్‌లో
- మే నాటికి అవిశ్వాస తీర్మానానికి రంగం సిద్ధం
- ముందుగానే బీఆర్ఎస్‌ను ఒంటరిని చేయాలనే వ్యూహాలు

7



కాంగ్రెస్‌లోకి 'తూర్పు' కార్పొరేటర్లు?

- పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్న 21 మంది!
- మేయర్ పదవిని 'చే'జిక్కించుకునేందుకు కాంగ్రెస్ పావులు

వరంగల్ సిటీ, జనవరి 3 : వరంగల్ తూర్పు బీఆర్ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. తూర్పులో 24 మంది కార్పొరేటర్లలో అధికార పార్టీకి చెందిన 21 మంది మూకుమ్మడిగా కాంగ్రెస్‌లోకి చేరేందుకు నిశ్చయించుకున్నట్లు చర్చ కొనసాగుతోంది. ఈ మధ్యనే బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన కార్పొరేటర్ సైతం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నట్లు ప్రచారం జోరుగానే సాగుతోంది. మాజీ ఎమ్మెల్యేను అంటిపెట్టుకొని తిరిగిన వారే ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రధాన భూమిక పోషిస్తున్నట్లు సమాచారం. చివరి సారిగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి వారి మనసులో మాట చెబుదామని హైదరాబాద్ వెళ్లిన కార్పొరేటర్లకు కేటీఆర్ అపాయింట్‌మెంట్ దొరక్క నిరాశతో వెనక్కి వచ్చినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే ఇప్పటికే వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరుతున్నారు. ఇదంతా నిశితంగా పరిశీలిస్తున్న మేయర్ సైతం ఓ చారిత్రక నిర్ణయం తీసుకుంటుందని కాంగ్రెస్‌లోకి వెళుతున్న కార్పొరేటర్లు అభిప్రాయ పడుతున్నారు. అయితే హైదరాబాద్ తర్వాత అంతటి పేరున్న గ్రేటర్ వరంగల్ మునిసిపాలిటీ మేయర్ పీఠాన్ని దక్కించుకునేందుకు కాంగ్రెస్ అధిష్టానం పావులు కదుపుతున్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

కాంగ్రెస్‌కు టచ్‌లో 16 మంది కార్పొరేటర్లు

అసెంబ్లీ ఎన్నికల పూర్వం నుంచే కాంగ్రెస్ పార్టీకి తూర్పుకు చెందిన 16 మంది కార్పొరేటర్లు టచ్‌లో ఉంటున్నట్లు అప్పట్లోనే ప్రచారం జరిగింది. అనధికారికంగానే అప్పటి బీఆర్ఎస్ 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ సందర్భంలోనే మరో 8 మంది బీఆర్ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంటున్నారనే ప్రచారం జరిగింది. కాగా, అప్పుడు కేటీఆర్ బుజ్జగింపులతో ఆగిన వారు

మిగతా 8వ పేజీలో..

భార్య అస్థికలు గోదావరిలో కలిపి..

- మనస్తాపంతో భర్త ఆత్మహత్య
- స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఛాగల్‌లో ఘటన



వెంకటయ్య (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 3 : నెల రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన భార్య అస్థికలను గోదావరిలో కలిపి వచ్చిన భర్త మరుసటి రోజు బలవన్మరణానికి పాల్పడ్డాడు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఛాగల్ గ్రామానికి చెందిన లొంక వెంకటయ్య(57) భార్య అండాలు నెల రోజుల క్రితం మృతి చెందింది. మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులు భద్రాచలం వెళ్లి ఆమె అస్థికలను గోదావరి నదిలో కలిపి రాత్రికి ఇంటికి చేరుకున్నారు. అప్పటి నుంచి భార్యను గుర్తు చేసుకుంటూ మనస్తాపం చెందిన వెంకటయ్య బుధవారం సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి గ్రామ శివారులో పురుగుల మందు తాగి పడిపోయాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను వరంగల్ ఎంజీఎంకు తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. సీఐ నట్ల రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రాల అనుమానంతోనే చంపారు..

- వీడిన సోమలక్ష్మి హత్యకేసు మిస్టరీ
- నలుగురి అరెస్టు, పరారీలో ఒకరు

వివరాలు : 8లో..



నిందితులను అరెస్టు చూపిస్తున్న డీసీపీ రవీందర్, ఏసీపీ సతీష్‌బాబు, సీఐ, ఎస్సైలు

మహబూబాబాద్ జిల్లా కలెక్టర్‌గా అద్వైత్‌కుమార్ సింగ్



మహబూబాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా నూతన కలెక్టర్‌గా 2013 బ్యాచ్‌కు చెందిన అద్వైత్‌కుమార్‌సింగ్ బదిలీపై వస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 మంది కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా మహబూబాబాద్‌లో కలెక్టర్‌గా పని చేస్తున్న శశాంక రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా బదిలీపై వెళ్తున్నారు. ఆయన స్థానంలో కేంద్ర సర్వీసులో డిప్యూటేషన్‌లో పని చేస్తున్న అద్వైత్‌కుమార్‌సింగ్ మానుకోట కలెక్టర్‌గా వస్తున్నారు. కాగా, బదిలీపై వెళ్తున్న కలెక్టర్ శశాంక 1 సెప్టెంబరు 2021లో రాగా, దాదాపు 28 నెలల పాటు ఇక్కడ విధులు నిర్వర్తించారు.

ఇద్దరికి కరోనా



హనుమకొండ అర్బన్, జనవరి 3 : ఎంజీఎం ఆస్పత్రిలో బుధవారం 40 మంది రోగులు ఓపీ విభాగానికి రాగా, 26 మందికి ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు నిర్వహించామని, వీటిలో రెండు పాజిటీవ్‌గా నమోదు అయ్యాయని ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, ఎజీఎం కొవిడ్ వార్డులో ప్రస్తుతం ఆరుగురు రోగులు చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు.

వీరభద్రుడిపై చిన్న చూపేల..?

- దాతల సహకారంతోనే అభివృద్ధి
- నిధులు కేటాయించని ప్రభుత్వం
- నేడు వీరభద్రస్వామి జాతర అభివృద్ధి సమీక్ష సమావేశం
- హాజరు కానున్న మంత్రి పొన్నం ప్రభాకర్



జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో రమేష్



భీమదేవరపల్లి, జనవరి 3: కొత్తకొండ వీరభద్రస్వామి జాతర అభివృద్ధిపై ప్రభుత్వాలు చిన్న చూపు చూస్తున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్వామివారి ఆలన పాలన, అభివృద్ధి ప్రభుత్వం చూడాల్సి ఉండగా, కేవలం భక్తుల సహకారంతోనే అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. లక్షలాది మంది భక్తులు నిత్యం స్వామివారని దర్శించుకోవడానకి వస్తున్నా.. వారికి తగిన సౌకర్యాలు కల్పించడంలో మాత్రం ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నారే తప్ప పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టడం లేదు. కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి దేవాలయం హనుమకొండ జిల్లా పరిధిలోకి వచ్చిన తర్వాత దర్శనానికి వచ్చే భక్తులు సంఖ్య కూడా పెద్దఎత్తున పెరిగింది. కానీ వచ్చే భక్తులకు సరిపడా ఏర్పాట్లు కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమవుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చేపట్టాల్సిన అభివృద్ధి పనులు...

కొత్తకొండ వీరభద్రస్వామి దేవాలయంలో కొండపైకి ఘాట్ రోడ్ నిర్మాణం, ఆలయం చుట్టూ పచ్చదనం ఏర్పాటు చేసేందుకు గ్రీనరీ, ఆలయ ప్రాంగణం మొత్తం సీసీ రోడ్ల నిర్మాణం, వీఐపీల కోసం గెస్టహౌజ్ నిర్మాణం, అన్నదానం కోసం భోజనశాల ఏర్పాటు, మహిళల కోసం స్నానాల ఘట్టం, అద్దాల మండపం, సెంట్రల్ లైటింగ్ సిస్టం, ఆలయం చుట్టూ ఆర్చిగేట్ల ఏర్పాటు తదితర అభివృద్ధి పనులు చేస్తే వచ్చే భక్తులకు సౌకర్యవంతంగా ఉంటుందని పలువురు తెలుపుతున్నారు. కొత్తకొండ దేవాలయానికి చెందిన ఎకరం భూమిలో 2017లో ప్రభుత్వం హరిత హోటల్ ను నిర్మించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు దానికి సంబంధించిన లీజ్ డబ్బులు మాత్రం దేవాలయానికి ఇవ్వడం లేదు. పైగా బ్రహ్మోత్సవాల సందర్భంగా వీఐపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు ఎవరైనా వస్తే వారికి కేటాయించిన రూమ్‌ల బిల్లులు మాత్రం దేవాలయం చెల్లించాలని అధికారులు పేర్కొంటున్నారు.

నేడు మంత్రి సమీక్ష సమావేశం

కొత్తకొండ జాతర బ్రహ్మోత్సవాల సమీక్ష సమావేశాన్ని స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి కలెక్టర్‌తో పాటు వివిధ శాఖాల అధికారులు పాల్గొననున్నారు. జాతర అబివృద్ధిపై కూడా ఈ సమావేశంలో మాట్లాడనున్నారు. అభివృద్ధిపై మంత్రి పొన్నం ప్రభాకర్‌కు నివేదికలు సమర్పించేందుకు భక్తులు, అధికారులు సమాయత్తమవుతున్నారు. సమావేశానికి ఏర్పాట్లను హనుమకొండ ఆర్డీవో ఎల్ రమేష్‌తో పాటు దేవాలయ ఈవో కిషన్‌రావులను పరిశీలించారు.

రాజన్న సేవలో ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్

వేములవాడ, జనవరి 3: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారిని ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ బుధవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించారు. ఆలయ ప్రొటోకాల్ సూపరింటెండెంట్ సిరిగిరి శ్రీరాములు స్వామివారి ప్రసాదం అందజేశారు.



ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్‌కు ప్రసాదం అందజేస్తున్న సూపరింటెండెంట్ శ్రీరాములు

మేదరి సంఘం మహిళా నేతకు ఘన సత్కారం



దీకొండ సరితకు షీల్డ్‌ను బహుకరిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

వడ్డెపల్లి, జనవరి 3: తెలంగాణ బీసీ జన జాగృతి హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో జ్యోతిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. విద్య, రాజకీయ, సాంస్కృతిక, సమాజ సేవ, మహిళా అభ్యున్నతి, మహిళా జాగృతి విభాగాల్లో ప్రతిభ కనబర్చిన బీసీ కులాల మహిళలను కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. ఇందులో భాగంగా హనుమకొండ జిల్లా మేదరి కుల ప్రతినిధులుగా కార్యక్రమంలో పాల్గొని ప్రతిభ కనబర్చిన దీకొండ సరిత, చందా స్వరాజ్యంలకు షీల్డులను బహుకరించి అభినందించారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ చైర్మన్ వకుళా భరణం కృష్ణమోహన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి. హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్‌పై గురి



- బీఆర్‌ఎస్ కార్పొరేటర్లకు వల వేస్తున్న కాంగ్రెస్
- బీజేపీ కార్పొరేటర్లకు సైతం టచ్‌లోకి...
- మే నాటికి అవిశ్వాస తీర్మానానికి రంగం సిద్ధం
- ముందుగానే బీఆర్‌ఎస్‌ను ఒంటరిని చేయాలనే వ్యూహాలు

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 3 : వరంగల్ మహానగర పాలక సంస్థపై కాంగ్రెస్ గురి పెట్టింది. అవిశ్వాస తీర్మానం పావుగా హస్తం పార్టీ అస్త్రాలను సంధిస్తోంది. బీఆర్‌ఎస్ కార్పొరేటర్లకు వల వేసి ఆ పార్టీని బల్దియాలో ఒంటరిని చేయాలనే ప్రణాళికలతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇతర ముఖ్య నేతలు వ్యూహాలు పన్నుతున్నారు. ఇందులో భాగంగా బీఆర్‌ఎస్‌కు చెందిన ఆరుగురు కార్పొరేటర్లను కాంగ్రెస్ వైపు తిప్పేసుకున్నారు. రానున్న మే నాటి వరకు బల్దియా ప్రస్తుత పాలక వర్గానికి మూడేళ్లు పూర్తి అవుతాయి. అప్పటి వరకు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి కూల్చి వేయని పరిస్థితి. ఈ క్రమంలో ఇప్పటి నుంచే బీఆర్‌ఎస్‌తో పాటు బీజేపీ కార్పొరేటర్లను తమ వైపునకు లాగి బలాన్ని పెంచుకోవాలనే దిశగా కాంగ్రెస్ నేతలు అడుగులు వేస్తున్నారు. ఈ పరిణామాలతో బీఆర్‌ఎస్ కూడా తమ వారిని దక్కించుకునే దిశగా యత్నాలు చేపట్టింది.

చేరికలతో కాంగ్రెస్‌కు పెరిగిన బలం

బీఆర్‌ఎస్ కార్పొరేటర్ల చేరికలతో బల్దియాలో కాంగ్రెస్ కార్పొరేటర్ల బలం 11కు చేరింది. కాంగ్రెస్ కార్పొరేటర్లు తోట వెంకన్న, పోతుల శ్రీమాన్, జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీలు ఉన్నారు. కొద్ది రోజుల క్రితమే బీఆర్‌ఎస్ కార్పొరేటర్ గుండేటి నరేందర్ కాంగ్రెస్ కండువా కప్పేసుకున్నారు. తాజాగా బుధవారం కాంగ్రెస్‌లో చేరిన ఆరుగురు కార్పొరేటర్లతో మొత్తం కాంగ్రెస్ బలం బల్దియాలో 11కు పెరిగింది. టెక్నికల్‌గా బీఆర్‌ఎస్ కార్పొరేటర్ల చేరికలు ఆమోదం కావు కానీ వీరంతా బీఆర్‌ఎస్ పాలక వర్గం ప్రవేశపెట్టే తీర్మాణాలు, నిర్ణయాలను వ్యతిరేకిస్తూ విపక్షంగా వ్యవహరిస్తారు. మున్ముందు కూడా మరి కొందరు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరనున్నారనే సంకేతాల క్రమంలో బల్దియాలో కాంగ్రెస్ సంఖ్య మరింత పెరిగి బీఆర్‌ఎస్‌పై ఆధిపత్యం చెలాయించే పరిణామాలు దారి తీస్తాయానే చర్చ జరుగుతోంది.

మే నాటికే అవిశ్వాస తీర్మానం

బల్దియాలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు కాంగ్రెస్ చేసే యత్నాలు ఇప్పుడు ఫలించని పరిస్థితి. మే వరకు బీఆర్‌ఎస్ పాలకవర్గానికి మూడేళ్లు పూర్తి కానున్నాయి. నిబంధనల మేరకు మూడేళ్ల తరువాతే అవిశ్వాస తీర్మానానికి అవకాశం ఉండడంతో కాంగ్రెస్ ఇప్పటికిప్పుడే కూల్చేయలేదనే ధీమాతో బీఆర్‌ఎస్ నేతలు ఉన్నారు. ఇక మే నెలలో అవిశ్వాస తీర్మానం కాంగ్రెస్ నెగ్గాలన్నా ఆ పార్టీకి తగిన బలం సమకూరాల్సి ఉంది. ప్రస్తుతం బల్దియాలో 66 మంది కార్పొరేటర్లు ఉన్నారు. బీఆర్‌ఎస్ బలం 52 కార్పొరేటర్లతో ఉండేది. చేరికల క్రమంలో బీఆర్‌ఎస్ కార్పొరేటర్ల సంఖ్య 45కు తగ్గింది. ఎక్స్ అఫిషియో సభ్యులైన ఎంపీలు పసునూరి దయాకర్, డాక్టర్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీ పోచారం శ్రీనివాస్‌రెడ్డితో పాటు ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి బాధ్యత తీసుకుంటే కలిపి మొత్తంగా 49 బీఆర్‌ఎస్ బలంగా ఉంది. కాంగ్రెస్‌కు 11 మంది కార్పొరేటర్లు ఉండగా ఎక్స్ అఫిషియో సభ్యులు మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డితో కలిపి మొత్తంగా ఇప్పటికిప్పుడు 15 మంది ఉంటారు. అయితే ఎక్స్ అఫిషియోగా కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో రేవూరి, నాగరాజు పరకాల, వర్ధన్నపేట మునిసిపాలిటీల్లో బాధ్యత తీసుకుంటారో లేదో తేలాల్సి ఉంది. ఒకవేళ జీడబ్ల్యూఎంసీలోనే సభ్యులుగా ఉంటే మాత్రం కాంగ్రెస్ బలం ఇప్పటికిప్పుడు 15గా ఉన్నట్లే. అవిశ్వాస తీర్మానం కాంగ్రెస్ ప్రవేశపెట్టి నెగ్గాలంటే ఆ పార్టీకి ఎక్స్ అఫిషియోల సంఖ్యతో కాకుండా మరో 19 మంది కార్పొరేటర్ల బలం కావాల్సి ఉంది. ఈ క్రమంలో బీఆర్‌ఎస్, బీజేపీల నుంచి కార్పొరేటర్లను కాంగ్రెస్‌లోకి చేర్పించే వ్యూహంతో కాంగ్రెస్ నేతలు పావులు కదుపుతున్నారు. ఒకవేళ బీఆర్‌ఎస్ కార్పొరేటర్ల సంఖ్య తగ్గినా బీజేపీ కార్పొరేటర్లు మాత్రం కాంగ్రెస్ పక్షాన ఓటెయ్యడం కుదరదనే అంచనాలు ఉన్నాయి. ఈ క్రమంలో తమకు ఎలాంటి ధోకా ఉండదని, కాంగ్రెస్‌కు బలాన్నే చేకూర్చే అంత సంఖ్యలో బీఆర్‌ఎస్ కార్పొరేటర్లను కాపాడుకోవాలనే ప్రతి వ్యూహంతో బీఆర్‌ఎస్ అస్త్రాలను సిద్ధం చేసుకుంటోంది. మొత్తంగా ఆరు నెలల కౌంట్ డౌన్‌తో గ్రేటర్ రాజకీయాలు రసవత్తరం కానున్నాయి.

ముఖ్యమంత్రి ఓఎస్డీగా ముల్కనూరు వాసి


వేముల శ్రీనివాసులు

భీమదేవరపల్లి, జనవరి 3: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓఎస్డీగా ముల్కనూరుకు చెందిన వేముల శ్రీనివాసులును నియమిస్తూ చీఫ్ సెక్రటరీ శాంతికుమారి బుధవారం ఆదేశాలు జారీ చేశారు. దీంతో ముల్కనూరులో ఆయన మిత్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏడు సంవత్సరాలుగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ జాయింట్ ఐజీగా శ్రీనివాసులు పని చేశారు. ముల్కనూరులో నిరుద్యోగ యువతకు ఉచితంగా కోచింగ్, స్టడీ మెటీరియల్ అందించేందుకు ఏర్పాటు చేసిన ప్రజా గ్రంథాలయ ఏర్పాటులో శ్రీనివాసులుది కీలకపాత్ర. ఆయన ఓఎస్డీగా ఎన్నిక కావడంతో జడ్పీటీసీ వంగ రవి, ముల్కనూరు సర్పంచ్ మాడుగుల కొమురయ్య, పల్లా ప్రమోద్‌రెడ్డి, అరుణ్ కుమార్, లక్ష్మయ్య, వీరేశం తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఉద్యోగుల వేతనాలు వెంటనే విడుదల చేయాలి

హనుమకొండ రూరల్, జనవరి 3: సమగ్ర శిక్ష, కేజీబీవీ ఉద్యోగుల వేతనాలు వెంటనే విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సదాశివరెడ్డి, పెండెం రాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత రెండు నెలలుగా వేతనాలు అందక ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నూతన ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతి నెల ఒకటవ తేదీన వేతనాలు విడుదల చేయాలని ప్రకటనలో పేర్కొన్నారు.

ఉద్యమకారులకు సంక్షేమ పథకాలు అందించాలి


జూనియర్ అసిస్టెంట్ భగవాన్‌కు వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ ఉద్యమకారులు

ఇనుగుర్తి, జనవరి 3 : తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన ఉద్యమకారులకు సంక్షేమ పథకాలు అందించాలని, ప్రభుత్వం ప్రకటించిన 250 గజాల ఇంటిస్థలం ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారులు పింగిలి శ్రీనివాస్, ప్రభుత్వాన్ని కోరారు. ఇనుగుర్తి తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం జూనియర్ అసిస్టెంట్ భగవాన్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమం కోసం పనిచేసిన అమరవీరులకు, ఉద్యమకారులకు ఇండ్ల స్థలం, పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బూర రఘుపతి, సట్ల బిక్షపతి, లింగ్యానాయక్, హనుమాండ్ల సోమిరెడ్డి, జంపయ్య గండు నాగన్న పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర కీలకం

ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ పరికిపండ్ల అశోక్


నేరడ మోడల్‌స్కూల్లో మాట్లాడుతున్న డాక్టర్ పరికిపండ్ల అశోక్

కురవి, జనవరి 3 : విద్యతోనే సమాజంలో గౌరవం, ముందడుగు సాధ్యమని ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. కురవి మండలం నేరడ మోడల్‌స్కూల్లో బుధవారం ప్రేరణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. గత పది సంవత్సరాలుగా రాష్ట్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల కోసం ఉచిత ప్రేరణ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్షల్లో విజయం సాధించాలంటే కష్టించి చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అరుణ, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, షేక్.జానీ, కొండబత్తుల ఈశ్వర్, ప్రసాద్, కొండబత్తుల యాదగిరి, ఉపాధ్యాయులు వెంకటకృష్ణ, రజిత, రాంనర్సయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

మరిపెడ, జనవరి 3 : మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని నర్సింహులపేట ఎస్సీ బాలికల గురుకుల ప్రవేశాలకు 4వ తరగతి పాసైన విద్యార్థినుల నుంచి 5వ తరగతి ప్రవేశం కోసం ఆన్‌లైన్లో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆ గురుకుల ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. బుధవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 6వ తేదీలోపు అర్హులైన విద్యార్థినులు రూ.100 రుసుం చెల్లించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని నిరుపేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కుమారుడితో వెళ్లిన మహిళ అదృశ్యం

మహబూబాబాద్ రూరల్, జనవరి 3 : మహబూబాబాద్ మండలంలోని కొత్తరెడ్యాల గ్రామానికి చెందిన భార్య మేకల అనిత కుమారుడు హర్షవర్ధన్ గత ఐదు రోజుల నుంచి కన్పించడం లేదని భర్త మేకల మల్లయ్య ఫిర్యాదు చేసినట్లు రూరల్ ఎస్సై దీపికరెడ్డి బుధవారం తెలిపారు. మల్లయ్య డిసెంబర్ 30న పక్క గ్రామమైన నర్సింహులగూడెంలో బంధువుల ఇంటికి శుభ కార్యక్రమానికి వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి తన భార్య అనిత, తమ ఏడేళ్ల కుమారుడు కన్పించకపోవడంతో బంధువుల ఇళ్లలో వాకబు చేసినట్లు చెప్పారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వివరించారు. మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆదిత్య ఆస్పత్రి వ్యవస్థాపకుడి మృతి


డాక్టర్ కృష్ణారెడ్డి (ఫైల్)

హనుమకొండ అర్బన్, జనవరి 3 : హనుమకొండలోని ఆదిత్య ఆస్పత్రి వ్యవస్థాపకుడు డాక్టర్ చింతలపాణి కృష్ణారెడ్డి (74) బుధవారం సాయంత్రం అనారోగ్యంతో హనుమకొండలోని ఇంటిలో మృతి చెందారు. కాజీపేట సమీపంలోని సూర్యకుటీర్ వెంచర్‌లో గురువారం ఉదయం 10 గంటలకు అంత్యక్రియలు నిర్వహించనున్నారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెర గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి వైద్య పట్టా పొంది రోగులకు వైద్య సేవలందించారు. హుస్నాబాద్ మండల కేంద్రంలో మూడు దశాబ్దాల పాటు వైద్య సేవలు అందించారు. ఆయనకు రాకేశ్‌రెడ్డి, వరుణ్‌రెడ్డి ఇద్దరు కుమారులు ఉన్నారు. కృష్ణారెడ్డి మృతి పట్ల పలువురు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వైద్యులు సంతాపం ప్రకటించారు.

అర్చక ఉద్యోగుల సమస్యలు తీర్చాలి

ఉప ముఖ్యమంత్రి భట్టికి విజ్ఞప్తి


ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసిన ప్రధాన దేవాలయాల అర్చక ఉద్యోగులు

హనుమకొండ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని అర్చక ఉద్యోగులు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కోరారు. బుధవారం తెలంగాణ అర్చక ఉద్యోగుల జాక్ ఆధ్వర్యంలో ప్రధాన దేవాలయాల అర్చకులు ఉప ముఖ్యమంత్రిని హైదరాబాద్‌లో జ్యోతిరావుఫూలే ప్రజాభవన్‌లో కలిశారు. అర్చక, ఉద్యోగుల సమస్యలపై వినతి పత్రాన్ని సమర్పించారు. రాష్ట్రంలోని 12,625 దేవాలయాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో అన్యాక్రాంతం అయిన 36వేల ఎకరాల ఆలయ భూములను భూకబ్జాదారుల నుంచి విడిపించి వేలం పాట ద్వారా అమ్మి తద్వారా వచ్చే అదాయంతో ఆలయాలను అభివృద్ధి చేయాలని కోరారు. గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద జీవో 577 ప్రకారం మిగిలిన 2వేల మంది అర్చక ఉద్యోగులకు ట్రెజరీ ద్వారా వేతనాలు ఇవ్వాలని అభ్యర్థించారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చేర్చిన విధంగా దూప దీప నైవేద్యం అర్చకులకు నెలకు రూ.12 వేలు ఇప్పించాలని కోరారు. భట్టి విక్రమార్క ఇందుకు సానుకూలంగా స్పందించారు. ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కొండగట్టు, వేములవాడ, కాళేశ్వరం, బాసర, భద్రాచలం, యాదాద్రి, కొమురవెల్లి తదితర దేవాలయాల అర్చకులు, వేద పండితులతో పాటు దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ కురాకుల జ్యోతి ఈవోల సంఘం ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణ అర్చక, ఉద్యోగుల జాక్ చైర్మెన్ గంగు ఉపేంద్ర శర్మ, రాష్ట్ర దేవాలయాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కొండూరి క్రిష్ణమాచారి, అధ్యక్షుడు భద్రీనారాయణాచార్యులు డీడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నిట్టూరి సతీష్ శర్మ వరంగల్ అధ్యక్షుడు పెన్నా మోహన్ శర్మ తదితరులు ఉప ముఖ్యమంత్రిని కలిసినవారిలో ఉన్నారు. అర్చకులు భట్టి విక్రమర్కకు వేద మంత్రాలతో ఆశీర్వచనం చేసి సత్కరించారు.

గీత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు


ఎమ్మెల్యే నాగరాజుకు వినతి పత్రం ఇస్తున్న గోపాల్‌పూర్ గీత కార్మికులు

వడ్డెపల్లి, జనవరి 3 : గీత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు అన్నారు. బుధవారం హనుమకొండ సుబేదారి ప్రాంతంలోని ఎమ్మెల్యే నివాసంలో గోపాల్‌పూర్ గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు చింత రమేష్ గౌడ్, కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు దూలం క్రాంతి కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లోని ఊర చెరువు ప్రాంతంలోని సుమారు వెయ్యి గజాల ప్రభుత్వ స్థలాన్ని గత వంద సంవత్సరాలుగా గోపాల్‌పూర్ గీత కార్మికులు శ్మశాన వాటిక కోసం వాడుకుంటూ దహన సంస్కారాలను నిర్వహిస్తున్నారన్నారు. ఏడాది కాలంగా తాము వాడుకుంటున్న శ్మశాన వాటిక స్థలాన్ని సీపీఎం నేతల ప్రోద్బలంతో కొందరు గుడిసెలు వేశారని తెలిపారు. గతంలో ఇదే స్థలంలో గుడిసెలు వేసుకోగా పోలీసుల సహకారంతో రెవెన్యూ అధికారులు తొలగించారని మళ్లీ ఇదే స్థలంలో గుడిసెలు వేసి తమ శ్మశాన వాటిక స్థలాన్ని ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. గోపాల్‌పూర్ గీత కార్మికులకు కేటాయించిన శ్మశాన వాటిక స్థలాన్ని పరిరక్షించాలని ఎమ్మెల్యే నాగరాజుకు ఇచ్చిన పత్రంలో కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో గోపాల్‌పూర్ మాజీ ఎంపీటీసీ దూలం రఘుపతిగౌడ్, మాజీ సర్పంచ్ దూలం సదానందం గౌడ్, గీత కార్మిక సంఘం నేతలు వల్లాల రాజ్‌కుమార్ గౌడ్, మాజీ డీసీపీ సుదర్శన్‌గౌడ్, అనిల్‌గౌడ్, శ్రీనివాస్, కార్తీక్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఆటో డ్రైవర్ల భిక్షాటన


హనుమకొండ చౌరస్తాలో భిక్షాటన చేస్తూ ర్యాలీగా వెళ్తున్న ఆటో కార్మికులు

హనుమకొండ స్పోర్ట్స్, జనవరి 3 : మహాలక్ష్మి పథకంలో భాగంగా ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రవేశపెట్టడంతో ఉపాధి కోల్పోయామని ఆటో డ్రైవర్‌లు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. బుధవారం హనుమకొండ వేయి స్తంభాల ఆలయం నుంచి ఐక్య కార్యచరణ కమిటీ నాయకులు ఇసంపెల్లి సంజీవ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు హనుమకొండ చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్లి భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. అనంతరం సంజీవ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో తాము జీవనోపాధి కోల్పోయి కుటుంబాలతో పాటు రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లను ఆదుకుని నెలకు రూ. 15000 జీవన భృతి అందించాలన్నారు. ఆటో కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలని కోరారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆటో కార్మికులు ఐక్యంగా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడంతో పాటు ఉద్యమాలు, ధర్నాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆటో కార్మికులు మడికొండ బాబు, కలకోట్ల జయరాం, పసునూరి బాబు, మంద శ్రీధర్‌రెడ్డి, కుమార్, బొల్లం సంజీవ, గుండా రమేష్, సాయిలు, శ్రీనివాస్, ఖాజాపాషా, మాషూక్, రాజు, హైమద్, పద్మరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా రాజేష్


రాజేష్‌కు నియామక పత్రాన్ని అందిస్తున్న నరేందర్

గీసుగొండ, జనవరి 3: తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా 15వ డివిజన్ మొగిలిచర్ల గ్రామానికి చెందిన బరుపటి రాజేష్ ఎంపికయ్యారు. ఈ మేరకు రాకేష్‌కు నియామక పత్రాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ హైదరాబాద్‌లో బుధవారం అందజేశారు. కాగా, తన ఎంపికకు సహకరించిన గీసుగొండ ఎంపీపీ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు భీమగాని సౌజన్యకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పత్తిపాక తిరుపతి, బిల్లా రాజేష్, చింతం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కాపువాడలో చోరీ

రూ. 3 లక్షల విలువైన ఆభరణాల అపహరణ

హనుమకొండ క్రైం, జనవరి 3 : హనుమకొండ పోలీసు స్టేషన్ పరిధిలోని కాపువాడలో దొంగలు హల్‌చల్ చేశారు. ఓ తాళం వేసిన ఇంట్లో చొరబడి అందిన కాడికి దోచుకెళ్లారు. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాపువాడకు చెందిన బొల్లం వీరభద్రస్వామి రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి వేములవాడ, కొండగట్టుకు విహార యాత్రకు వెళ్లాడు. తిరిగి మంగళవారం రాత్రి వచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా పగులగొట్టి ఉంది. బీరువాతో వెతికి చూడగా బంగారం, వెండితో పాటు విలువైన వస్తువులు కనిపించకుండా పోయాయి. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో క్లూస్ టీం, సీసీఎస్ పోలీసులు అక్కడకు చేరుకుని ఆధారాలు సేకరించారు. హనుమ కొండ పోలీసులు బాధితుల నుంచి ఫిర్యాదు స్వీకరించారు. సుమారు రూ. 3 లక్షల విలువైన సొత్తు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్టు పోలీసులు నిర్ధారించారు. నిందితుల కోసం గాలిస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు.





కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న అడిషనల్ కలెక్టర్

కలెక్టర్‌ను కలిసిన కమిషనర్, అడిషనల్ కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, జనవరి 3: నూతన ఆంగ్ల సంవత్సరం 2024 సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్యను చాంబర్‌లో జిల్లా అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా కలెక్టర్ పి.ప్రావీణ్యను ఆమె చాంబర్‌లో కలిసి మొక్క అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజలందరికీ అభయహస్తం పత్రాలు అందజేస్తాం

▸▸ మునిసిపల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా



ఖిలావరంగల్ కోటలోని సెంటర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ రిజ్వాన్ బాషా

ఖిలావరంగల్, జనవరి 3 : ఇందిరమ్మ అభయహస్తం పత్రాలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలందరికి వాటిని అందజేస్తామని మునిసిపల్ కమిషనర్ రిజ్వాన్ బాషా అన్నారు. నగరంలోని 37, 38 డివిజన్లలోని ఖిలావరంగల్ ఏకశిల క్రీడా మైదానం, ఎస్సీ కాలనీలో గల కేంద్రాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రేషన్ కార్డుల కోసం అభయహస్తం జిరాక్స్ లేదా తెల్ల పేపర్‌పై కూడా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు. అందరికి ఇందిరమ్మ పత్రాలు అందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈ శ్రీనివాస్‌రావు, బిల్ కలెక్టర్ కిషోర్, జవాన్ కుమార్, నెప్మా సీవో ప్రవీణ్, ఆర్పీలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ, ఏఎన్ఎం పాల్గొన్నారు. ఖిలావరంగల్ 37వ డివిజన్ తూర్పుకోటలో ఇందిరమ్మ అభయ హస్తం పత్రాలను కాంగ్రెస్ నాయకుడు సంగరబోయిన చందర్, అధికారులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సిరబోయిన గిరి, ఇట్నేని ప్రతాప్, కలకుంట్ల కుమార్, రాజు, లక్ష్మణ్, అధికారులు పూర్ణ, రంజిత్‌రెడ్డి, ఆశాలు, అంగన్‌వాడీ, ఏఎన్ఎం తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలకు పూర్వ విద్యార్థుల విరాళం



విరాళాన్ని అందజేస్తున్న పూర్వ విద్యార్థులు వాసుదేవరెడ్డి, మహిపాల్‌రెడ్డి

మట్టెవాడ, జనవరి 3: వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు పూర్వ విద్యార్థులు బుధవారం రూ.1.25 లక్షల విరాళాన్ని అందజేశారు. పూర్వ విద్యార్థి ఈద వాసుదేవ రెడ్డి, రూ.లక్ష, కట్ట మహిపాల్‌రెడ్డి రూ25వేల నగదును కళాశాల ప్రిన్సిపాల్‌కు అందించారు. ఈ విరాళాలతో డుయల్ డెస్క్ బెంచీలను పూర్వ విద్యార్థులు కళాశాలకు అందచేశారు. విరాళాలు అందించిన దాతలను ప్రిన్సిపాల్ బైరి ప్రభాకర్ శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు హైదర్ అలీ ఖాన్, పి.శ్రీదేవి, నటరాజ్‌శేఖర్, ఎం.వెంకన్న, రాజేశ్వర్‌రావు, నాగరాజరావు, పూర్వ విద్యార్థుల సంఘం గౌరవ అధ్యక్షుడు టీఎస్ స్వామి, అధ్యక్షుడు భీంరావు, ఆనంద్ కుమార్, సూపరింటెండెంట్ నాగరాజరావు, ప్రచార కార్యదర్శి మేకల అక్షయ్‌కుమార్, అంజయ్య, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులను కలిసిన ఉద్యోగులు



ఉన్నతాధికారులకు శుభాకాంక్షలు తెలుపుతున్న మార్కెట్ ఉద్యోగులు

వరంగల్‌టౌన్, జనవరి 3: మార్కెటింగ్ శాఖ వరంగల్ రీజియన్ జాయింట్ డైరెక్టర్ మల్లేశం, డిప్యూటీ డైరెక్టర్ అజ్మీర రాజు, డీఎంవో ప్రసాదరావు, ఈఈ లక్ష్మణ్‌గౌడ్‌ను బుధవారం ఏనుమాముల మార్కెట్ కమిటీ ఉద్యోగులు గ్రేడ్ కార్యదర్శులు బియాబానీ, రాము ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అకౌంటెంట్ రాజ్‌కుమార్, సూపర్‌వైజర్స్ శివకుమార్, మురళి,వెంకన్న, నర్సింగరావు,శ్రీను, లక్ష్మీనారాయణ, జేఎంఎస్ శ్రీనివాస్‌పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే సేవలు మరువలేనివి



నగరంలోని ఎంసీపీఐ(యు) జిల్లా కార్యాలయంలో సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

గీసుగొండ, జనవరి 3: కులమతాలకు అతీతంగా అందరికి విద్య అందించాలనే లక్ష్యంతో సావిత్రిబాయి పూలే చేసిన సామాజిక సేవలు మరువలేనివని బీజేపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ అన్నారు. ధర్మారం వద్ద గల బీజేపీ జిల్లా కార్యాలయంలో పూలే జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పలువురు బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ భర్త జ్యోతిరావు పూలేతో కలిసి దేశ వ్యాప్తంగా విద్యా దానం చేసిన తొలి మహిళా ఉపాధ్యాయినిగా ఆమె చరిత్ర కెక్కారని అన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి మాట్లాడుతూ మానవులంతా సమానమే అంటూ కులాంతర వివాహాలను జరిపించిన సంఘసంస్కర్త పూలే అని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, నాయకులు చిటూరి అశోక్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రాదారపు శివకుమార్, కార్యదర్శి మొలుగూరి శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, కార్యాలయ కార్యదర్శి కంది క్రాంతికుమార్, ములక ప్రసాద్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

● మామునూరు: ప్రజలను సామాజికంగా చైతన్యం చేయడంలో సావిత్రిబాయి పూలే ఆదర్శమని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిద్దెపాక ఎల్లయ్య అన్నారు. 43వ డివిజన్ పెన్షన్‌పూర్‌లోని ప్రజ్ఞ హై స్కూల్‌లో సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించగా ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కావ్య, వైస్ ప్రిన్సిపాల్ సుమతి, ఉపాధ్యాయులు సులోచన జీనత్, దివ్య, అనూష, మౌనిక, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే ఖిలా వరంగల్ మండలం తిమ్మాపురం ప్రభుత్వ పాఠశాలలో ఏకశిల యూత్ అసోసియేషన్ అండ్ లైబరీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. యూత్ ముఖ్య సలహాదారు మేకల సూరయ్య అధ్యక్షత వహించగా, టీఎస్ఎస్పీ ఫోర్త్ బెటాలియన్ రిటైర్డ్ పోలీసు అధికారుల వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఇనుగాల జోగిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయుడు తాళ్లపల్లి చంద్రం, మేకల సారయ్య మండల సారయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

జయంతి వేడుకల్లో పలువురు నేతలు

● కరీమాబాద్: మహిళా హక్కులే మానవ హక్కులని, సామాజిక సమస్యలపై పోరాటం చేసిన ధీర వనిత సావిత్రిబాయి పూలే అని తెలంగాణ అంబేద్కర్ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గద్దల కుమారస్వామి అన్నారు. కరీమాబాద్‌లోని లక్ష్మీనగర్‌లో గోగికార్ రవీందర్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రీన్‌లాండ్ స్కూల్ ప్రిన్సిపాల్ మహ్మద్ ముంతాజ్ అహ్మద్, మాధవి, స్వర్ణలత, అప్రా, అంగన్‌వాడీ టీచర్ సంధ్య, రమేష్, కాంగ్రెస్ నాయకులు టింగిలికార్ మనోహర్, రాజేంద్రప్రసాద్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

● శంభునిపేట: మహిళల అభ్యున్నతి కోసం సావిత్రిబాయి పూలే చేసిన సేవలు మరువలేనివని రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆచార్యులు డాక్టర్ ఎ.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కళాశాలలో ఆమె జయంతిని నిర్వహించారు. కళాశాల మహిళా సాధికారిత విభాగం కన్వీనర్ ఆర్.రుద్రాణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎం.రెడ్డప్ప, ఎ.రమేష్, డాక్టర్ వాల్యా, బి.రాజశేఖర్, మినహాజుద్దీన్, శాంతాకుమారి తదితరులు పాల్గొన్నారు. రంగశాయిపేట అరవింద పబ్లిక్ పాఠశాలలో ప్రిన్సిపాల్ పంచకం నర్సయ్య సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ కె.శోభ పూలే చిత్రపటానికి నివాళులర్పించారు.



ధర్మారం వద్ద గల బీజేపీ జిల్లా కార్యాలయంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

● గిర్మాజీపేట: వరంగల్‌లోని హెడ్‌పోస్టాఫీసు సెంటర్‌లోని ఎంసీపీఐ(యు) జిల్లా కార్యాలయంలో పార్టీ నగర కార్యదర్శి సుంచు జగదీశ్వర్ అధ్యక్షతన సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. పూలే చిత్రపటానికి జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, బీఎల్ఎఫ్ వరంగల్ తూర్పు నియోజకవర్గ కన్వీనర్ ఐతం నగేష్, నాయకులు నలివేల రవి, కొంరయ్య తదితరులు పాల్గొన్నారు.

● ఖిలావరంగల్: సావిత్రిబాయి పూలే జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ సమితి సభ్యుడు పనాస ప్రసాద్ అన్నారు. శివనగర్‌లోని తమ్మెర భవన్‌లో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 193వ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదళ్ల శరత్, ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి మస్క సుధీర్, జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్, సోను, ప్రశాంత్, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు. ఖిలావరంగల్ పద్మశాలి కల్యాణ భవనంలో సావిత్రిబాయి పూలే జయంతిని మూన్‌మెంట్ 21 సమన్వయకర్త మైదం సంజీవ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రీతి దయాళ్, సభ్యులు పాల్గొన్నారు. ఖమ్మం రోడ్డు వద్ద నిర్వహించిన వేడుకల్లో అభయ ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్టు జిల్లా అధ్యక్షురాలు పోలెపాక అంబు ప్రసన్న, బైరబోయిన సరోజనయాదవ్ కొండబత్తిని శ్రీలత, మాదనాల శ్రీలత, వడ్డెపల్లి సవిత, బైరపాక సురేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నాగరాజును కలిసిన పాస్టర్లు



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న పాస్టర్లు

వరంగల్ టౌన్, జనవరి 3 : నగరంలోని 14వ డివిజన్ ఏనుమాముల పాస్టర్ల సంఘం నూతన కమిటీ సభ్యులు టీపీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర కోఆర్డినేటర్ అడుప మహేష్ ఆధ్వర్యంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజును బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పాస్టర్లు ఆయనకు బొకే ఇచ్చి ప్రార్థన చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో పాస్టర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు షడ్రక్, దేవయ్య, శేఖర్, కిరణ్, జోసెఫ్, థామస్, అనిల్, గబ్రిల్, ఇశ్రాయిల్, ముఖేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంగపేట ఎంపీడీవో మృతి



శ్రీధర్ (ఫైల్)

మంగపేట, జనవరి 3: ములుగు జిల్లాలోని మంగపేట ఎంపీడీవో కర్నాటి శ్రీధర్(57) మృతి చెందారు. రెండు రోజుల క్రితం ప్రజా పాలనలో విధుల్లో ఉండగానే అస్వస్థతకు గురైన ఆయన చికిత్స పొంది డిశ్చార్జ్ అయ్యారు. బుధవారం తెల్లవారుజామున కన్నుమూశారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమానికి ఎంపీడీవో శ్రీధర్ హాజరవుతున్నారు. డిసెంబరు 30న మండలంలోని కత్తిగూడెంలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో ఒక్కసారిగా ఆయన అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయన్ను ఉద్యోగులు ఇంటికి చేర్చారు. ఇదే క్రమంలో 31న ఒళ్లు నొప్పులతో పాటు తీవ్ర జ్వరం రావడంతో మాజీ ఎంపీటీసీ మండవ రామకృష్ణ ఆయన్ను ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం ములుగులోని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ మూడు రోజుల పాటు వైద్యం పొంది డిశ్చార్జ్ అయిన ఎంపీడీవో బుధవారం తెల్లవారుజామున బాత్‌రూంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. గుండెనొప్పి వచ్చి తుదిశ్వాస విడిచారు.

ఖమ్మం జిల్లా మధిరకు చెందిన శ్రీధర్ మంగపేట ఎంపీడీవోగా కొనసాగుతున్నారు. గతంలో వెంకటాపూర్ (రామప్ప) ఎంపీడీవోగా పనిచేశారు. ఆయనకు భార్య గీత, కూతురు ప్రియాంక ఉన్నారు. మంగపేటలోని అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. కూతురు అమెరికాలో భర్త, ఇద్దరు పిల్లలతో ఉంటున్నారు. శ్రీధర్ మృతదేహాన్ని బంధువులు మధిరకు తరలించారు. కూతురు అమెరికా నుంచి రాగానే అక్కడే అంత్యక్రియలు జరగనున్నాయి. ఎంపీడీవో శ్రీధర్ మృతి పట్ల మంత్రి సీతక్క దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

మంత్రాల అనుమానంతోనే చంపారు..

▸▸ వీడిన సోమలక్ష్మి హత్యకేసు మిస్టరీ

▸▸ నలుగురి అరెస్టు, పరారీలో ఒకరు

ఐనవోలు, జనవరి 3: హనుమకొండ జిల్లా ఐనవోలు మండలంలోని ఒంటిమామిడిపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు గోనె సోమలక్ష్మి ఇటీవల హత్యకు గురైంది. ఈ హత్య కేసుకు సంబంధించి నలుగురు నిందితులను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ తెలిపినవివరాల ప్రకారం..గ్రామానికి చెందిన సోమలక్ష్మి ఇటీవల హత్యకు గురికాగా.. మొదట ఆమె చిన్న కుమారుడు సాయిలుపై అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారించారు. కానీ, అతడు హత్య జరిగిన సమయంలో ఓమిల్లులో హమాలీ పనికి వెళ్లినట్లు నిర్ధారించి మరో కోణంలో విచారణ చేయగా అసలు నిందితులు దొరికారు.

సోమలక్ష్మి ఇంటి పక్కనే ఉండే గోనె మధు అనే యువకుడు గత డిసెంబరు 17న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన కుమారుడు ఆత్మహత్య చేసుకోవడానికి సోమలక్ష్మి మంత్రాలే కారణమని భావించిన మధు తండ్రి రాజు అలియాస్ పెద్దరాజు సోమలక్ష్మిపై కక్ష పెంచుకుని చంపాలని నిర్ణయించుకున్నాడు.

ఇందుకు తన చిన్న కుమారుడు అనిల్, సంగెం మండలం మొండ్రాయికి చెందిన బంధువు పెండ్లి యుగంధర్, ఐనవోలుకు చెందిన తన అల్లుడు అనుముల రంజిత్, అదే గ్రామానికి చెందిన ముస్కు రాజశేఖర్‌ల సహకారం కోరాడు. సోమలక్ష్మి పాలకుర్తి మండలం దర్దేపల్లిలో ఉన్న తన కూతురు ఇంటికి వెళ్లి డిసెంబరు 26 రాత్రి గ్రామానికి చేరుకుంది. ఆమె రాకను పెద్దరాజు గమనించాడు. తెల్లారితే కొడుకు దశదిన కర్మ ఉన్నందున ఆ పనుల్లో ఉంటూనే, రాత్రి నలుగురి సహకారంతో ఇంటి ఆవరణలో నిద్రిస్తున్న సోమలక్ష్మి తలపై కర్రలతో గట్టిగా కొట్టడంతో తలపగిలి అక్కడికక్కడే మృతి చెందింది.

ఆ తర్వాత మృతురాలి మంచాన్ని కొత్తగా నిర్మిస్తున్న ఇంటి గోడల మధ్య పెట్టి దుప్పటి కప్పి, కుమారుడి దశదిన కర్మ పనుల్లో నిమగ్నమైయ్యారు. ఇది కక్షతోనే జరిగిన హత్యగా భావించిన పోలీసులు ఐనవోలు బ్రాందీషాపుతో పాటు రహదారుల్లో ఉన్న సీసీ పుటేజీలను పరిశీలించగా ఆ రాత్రి నిందితులు అనిల్, రాజశేఖర్‌లు కలిసి మద్యం సేవించి వెళ్లినట్లు గుర్తించారు. వారిని విచారించగా హత్య తాలుకు వివరాలు వెల్లడించారు. మంత్రాల అనుమానంతోనే సోమలక్ష్మిని చంపినట్లు వారు ఒప్పుకోవడంతో నలుగురిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. రంజిత్ పరారీలో ఉన్నట్లు డీసీపీ తెలిపారు. కేసు దర్యాప్తులో ప్రతిభ చూపిన మామునూరు ఏసీపీ సతీష్‌బాబు, పర్వతగిరి సీఐ అనుముల శ్రీనివాస్, ఐనవోలు ఎస్సై నవీన్‌కుమార్‌తో పాటు సిబ్బందిని అభినందించారు.

మాజీ ఎంపీటీసీ నర్సింగం మృతి

గీసుగొండ, జనవరి 3: మండలంలోని మచ్చాపూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ గడ్డం నర్సింగం(60) బుధవారం మృతి చెందాడు. నర్సింగం కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా, కాంగ్రెస్ జిల్లా నాయకుడు చాడా కొమురారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ నర్సింగం కుటుంబాన్ని పరామర్శించారు.

రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జిని కలిసిన నేతలు

మట్టెవాడ, జనవరి 3: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జిగా నియమితులై మొదటిసారిగా హైదరాబాద్‌కు వచ్చిన దీపాదాస్ మున్షీని బుధవారం రాష్ట్ర మైనార్టీ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రహత్ పర్వీన్ మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షికి పార్టీ నాయకులు పూలబొకే అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహ్మద్ ఖాజా పాషా, గ్రేటర్ కాంగ్రెస్ ముస్లిం, మైనారిటీ వైస్ చైర్‌పర్సన్ మహ్మద్ జమీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైమరీ హెల్త్ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ

వరంగల్ కలెక్టరేట్, జనవరి 3 : అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌కు చెందిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.వెంకట రమణ ఆవిష్కరించారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఇమ్యూనియల్ ఆఫీసర్ డాక్టర్ ప్రకాష్, అసోసియేషన్ అధ్యక్షుడు జన్ను కోర్నెల్, కోశాధికారి రామా రాజేష్‌ఖన్నా, శ్రీనివాస్‌బాబు, నూకల అంజి, అర్చన, సునిత, పరికిపండ్ల ఏకనాథం తదితరులు పాల్గొన్నారు.

కోటకట్ట మట్టి అక్రమంగా తరలింపు

గీసుగొండ, జనవరి 3: పురావస్తు శాఖకు చెందిన కోటకట్ట మట్టిని ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. మండలంలోని వంచనగిరి రైల్వేగేటు సమీపంలో అండర్ బ్రిడ్జి నిర్మాణం జరుగుతుండగా కోటమట్టిని తవ్వి పార్మేషన్ బైపాస్ రోడ్డుకు వినియోగిస్తున్నట్లు చెప్పారు. మట్టి తరలింపుపై అధికారులు విచారణజరిపి చర్యలు తీసుకోవాలనివారు కోరుతున్నారు.



కోటకట్ట మట్టిని తవ్విన దృశ్యం

సమన్వయంతో పనిచేయాలి : ఎంపీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కళావతి

సంగెం, జనవరి 3: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ కందగట్ల కళావతి అన్నారు. సంగెంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలోని ఆయా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేయాలన్నారు. ప్రజా పాలనకు సంబంధించిన దరఖాస్తులను ప్రజలకు అందుబాటులో ఉంచాలని అన్నారు. సీసీ రోడ్లకు సంబంధించిన బిల్లులను తక్షణమే విడుదల చేసేలా చొరవ తీసుకోవాలన్నారు. సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి జూడో పోటీలకు అరవింద్



విద్యార్థి అరవింద్‌ను అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, పీఈటీ నిశాంత్

పోచమ్మమైదాన్, జనవరి 3 : వరంగల్ దేశాయిపేటలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థి ఎస్.అరవింద్ జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ కన్నెబోయిన నిశాంత్ తెలిపారు. ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పాఠశాలలో విద్యార్థి అరవింద్‌ను అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తెలంగాణ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో తమ విద్యార్థి అరవింద్ 81 కిలోల విభాగంలో ప్రథమ బహుమతి సాధించినట్లు తెలిపారు. ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు పంజాబ్ రాష్ట్రంలో జరుగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

బీఆర్ఎస్‌కు కార్పొరేటర్ల గుడ్‌బై

(5వ పేజీ తరువాయి)

తెలియచేశారు. అనంతరం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి నేతృత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. వీరితో ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. పార్టీలోకి చేరడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియచేశారు. తామంతా నిర్బంధాన్ని వీడామని, స్వేచ్ఛాయుత, ప్రజా సేవాభావ రాజకీయ ప్రపంచంలోకి చేరడం ఆనందంగా ఉందని బీఆర్ఎస్ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు తదితరులు తమ మనోగతాన్ని వెలిబుచ్చారు.

త్వరలో తూర్పు, వర్ధన్నపేట కార్పొరేటర్లు

బీఆర్ఎస్‌తో పాటు బీజేపీకి చెందిన పలువురు కార్పొరేటర్లు కాంగ్రెస్‌లోకి వచ్చేందుకు రెడీగా ఉన్నారు. పశ్చిమ కార్పొరేటర్లతో పాటే తూర్పు, వర్ధన్నపేట కార్పొరేటర్లు కూడా కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రణాళికలు జరిగాయి. అయితే మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ సీనియర్ నాయకుడు కొండా మురళి ఈ వ్యవహారాన్ని వాయిదా వేసినట్లు సమాచారం. అదను చూసి అధిక సంఖ్యలో బీఆర్ఎస్ కార్పొరేటర్లను కాంగ్రెస్‌లోకి ఆహ్వానించే వ్యూహంతో కొండా మురళి పావులు కదుపుతున్నట్లు సమాచారం. అదే విధంగా వర్ధన్నపేట కార్పొరేటర్లకు కూడా ఎమ్మెల్యే నాగరాజుతో కలిసి కొండా మురళి చేరికల వ్యూహాన్ని పన్నినట్లు సమాచారం.

స్పందించని కార్పొరేటర్లు

బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు వరంగల్ పశ్చిమ, తూర్పు మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, నన్నపునేని నరేందర్, మేయర్ గుండు సుధారాణితో పాటు ఎమ్మెల్సీ బండా ప్రకాశ్ తదితరులు బీఆర్ఎస్ కార్పొరేటర్లను సంప్రదించి నిలువరించే ప్రయత్నాలు చేసినట్లు తెలిసింది. అయితే ఈ యత్నాలకు స్పందించకుండా మంగళవారం రాత్రే హైదరాబాద్‌లో బీఆర్ఎస్ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు మకాం వేసినట్లు తెలిసింది. బుధవారం ఉదయం కూడా బీఆర్ఎస్ నేతలకు టచ్‌లోకి రాకుండా, ఫోన్లు కూడా ఎత్తకుండా ఉన్నట్లు సమాచారం.

కాంగ్రెస్‌లోకి 'తూర్పు' కార్పొరేటర్లు?

(5వ పేజీ తరువాయి)

ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరేందుకు ముందు వరుసలో ఉన్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ కార్పొరేటర్లు రహస్యంగా సమావేశాలు ఏర్పాటు చేసుకుంటున్న నేపథ్యం కూడా కాంగ్రెస్‌లో చేరేందుకు సన్నాహక సమావేశాలనే ఊహాగానాలు ప్రచారంలో ఉన్నాయి. బీఆర్ఎస్ కార్పొరేటర్లు సైతం రహస్య సమావేశాల్లో పాల్గొంటూ అక్కడ జరిగిన చర్చలను గోప్యంగా ఉంచుతుండటంతో కార్పొరేటర్లు పార్టీ మారుతున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది.

ఓటమితో బీఆర్ఎస్ డీలా..

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పాలవ్వడంతో వరంగల్ తూర్పులో నాయకత్వం ఒక్క సారిగా డీలా పడింది. పార్టీలోని నాయకులను కట్టడి చేయడంలో తూర్పు బీఆర్ఎస్ నాయకత్వం ఫెయిల్ అయ్యింది. దీంతో ఆ పార్టీలో ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా తయారవడంతో ఆ పార్టీ కార్పొరేటర్లలో నిర్లిప్తత ఏర్పడింది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పటి ధీమా నాయకుల్లో కనపడక పోవడంతో కార్పొరేటర్లలో ఆందోళన మొదలైంది. పార్టీ పూర్తి స్థాయిలో పడిపోతుందనే ఆలోచనతో వారు కాంగ్రెస్‌లో చేరేందుకు మొగ్గు చూపుతున్నట్లు చెబుతున్నారు. పార్టీ అధిష్టానం సైతం డీలా పడిపోవడంతో ఇక పార్టీ నిలదొక్కుకుంటుందో లేదోననే భయాందోళనల్లో బీఆర్ఎస్ కార్పొరేటర్లు కొట్టుమిట్టాడుతున్నారు. దీంతో వారు అనివార్యంగా అధికారంలో ఉన్న కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. మరో రెండేళ్లు అధికారంలో ఉండాల్సిన వారు తప్పనిసరి నిర్ణయం తీసుకుంటే తప్ప అధికారంలో ఉండే పరిస్థితి లేదని, లక్షల రూపాయలు ఖర్చు పెట్టి కార్పొరేటర్‌గా గెలిస్తే ఇప్పటి వరకు సంపాదనే లేదని, కనీసం కాంగ్రెస్‌లో చేరితేనైనా కాంట్రాక్టుల్లో వచ్చే పర్సంటేజీలతోనైనా కాస్త వెనుకేసుకోవచ్చుననే ఆలోచనతో వారు కాంగ్రెస్‌లో చేరుతున్నారని కొంత మంది బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు.

కేటీఆర్ అపాయింట్‌మెంట్ దొరక్క వెనక్కి..

కాంగ్రెస్‌లో చేరేందుకు రంగంసిద్ధం చేసుకున్న పలువురు కార్పొరేటర్లు చివరి మాటగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసేందుకు హైదరాబాద్‌కు వెళ్లినట్లు తెలిసింది. అయితే అక్కడ కేటీఆర్ అపాయింట్‌మెంట్ దొరక్కపోవడంతో నిరాశతో వెనక్కి వచ్చినట్లు తెలుస్తోంది. కేటీఆర్‌కలిసినా కలవకపోయినా కాంగ్రెస్‌లో చేరాల్సిందేనని మెజారిటీ బీఆర్ఎస్ కార్పొరేటర్లు అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు సమాచారం.

స్పష్టత లేని బీఆర్ఎస్ కార్పొరేటర్లు

కాంగ్రెస్‌లో చేరుతున్నారని కొంత మంది బీఆర్ఎస్ కార్పొరేటర్లను అడిగితే స్పష్టమైన సమాధానం చెప్పడం లేదు. కొంత మంది మాత్రం కాంగ్రెస్‌లో ఎవరూ చేరడం లేదని, బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నామని చెబుతున్నారు. అయితే రహస్యంగా సమావేశాలు ఎందుకు ఏర్పాటు చేసుకుంటున్నారని అడిగితే మాత్రం వారు సమాధానం దాట వేస్తున్నారు. మొత్తంగా 21 మంది బీఆర్ఎస్ కార్పొరేట్లు కాంగ్రెస్‌లో చేరుతున్నారనే ప్రచారం వరంగల్ తూర్పులో వ్యాపించడంతో ఇప్పుడు నియోజకవర్గం అంతా కార్పొరేటర్ల ఫిరాయింపుపైనే చర్చ జరుగుతోంది.

అభయహస్తం దరఖాస్తు పత్రాలు అందలేదని ఆందోళన


ఉప్పరపల్లి జీపీ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న నాయకులు

చెన్నారావుపేట, జనవరి 3 : మండలంలోని ఉప్పరపల్లిలో ప్రజా ప్రభుత్వం అందిస్తున్న అభయహస్తం దరఖాస్తు పత్రాలు అర్హులైన లబ్ధిదారులకు అందలేదని సీపీఎం ఆధ్వర్యంలో గ్రామస్థులతో కలిసి బుధవారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. సీపీఎం మండల నాయకుడు పరికి మధుకర్ మాట్లాడుతూ గ్రామంలోని లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో దరఖాస్తు ఫారమ్స్ రాలేదన్నారు. ఈ నెల 6న చివరి తేదీ కావటంతో దరఖాస్తులు అందక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పోగుల అశోక్, గొల్లపల్లి స్వామి, కుక్కల నరేష్, రెడడ్డ బోయిన రాజు, కుమార్, ఎండీ మౌలానా తదితరులు పాల్గొన్నారు.

మంత్రాల అనుమానంతోనే చంపారు..

• వీడిన సోమలక్ష్మి హత్యకేసు మిస్టరీ • నలుగురి అరెస్టు, పరారీలో ఒకరు

ఐనవోలు, జనవరి 3 : హనుమకొండ జిల్లా ఐనవోలు మండలంలోని ఒంటిమామిడిపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు గోనె సోమలక్ష్మి ఇటీవల హత్యకు గురైంది. ఈ హత్యకేసుకు సంబంధించి నలుగురు నిందితులను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సోమలక్ష్మి ఇటీవల హత్యకు గురికాగా.. మొదట ఆమె చిన్న కుమారుడు సాయిలుపై అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారించారు. కానీ అతడు హత్య జరిగిన సమయంలో ఓ మిల్లులో హమాలీ పనికి వెళ్లినట్లు నిర్ధారించి మరో కోణంలో విచారణ చేయగా అసలు నిందితులు దొరికారు.

సోమలక్ష్మి ఇంటి పక్కనే ఉండే గోనె మధు అనే యువకుడు గత డిసెంబరు 17న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన కుమారుడు ఆత్మహత్య చేసుకోవడానికి సోమలక్ష్మి మంత్రాలే కారమణమని భావించిన మధు తండ్రి రాజు అలియాస్ పెద్దరాజు సోమలక్ష్మిపై కక్ష పెంచుకున్నాడు. వృద్ధురాలిని చంపాలని నిర్ణయించుకున్నాడు. ఇందుకు తన చిన్న కుమారుడు అనిల్, నంగెం మండలం మొండ్రాయికి చెందిన బంధువు పెండ్లి యుగంధర్, ఐనవోలుకు చెందిన తన అల్లుడు అనుముల రంజిత్, అదే గ్రామానికి చెందిన ముస్కు రాజశేఖర్‌ల సహకారం కోరాడు. సోమలక్ష్మి పాలకుర్తి మండలం దర్దేపల్లిలో ఉన్న తన కూతురు ఇంటికి వెళ్లి డిసెంబర్ 26 రాత్రి గ్రామానికి చేరుకుంది. ఆమె రాకను పెద్దరాజు గమనించాడు. తెల్లారితే కొడుకు దశదిన కర్మ ఉన్నందున ఆ పనుల్లో ఉంటూనే, రాత్రి నలుగురి సహకారంతో ఇంటి ఆవరణలో నిద్రిసున్న సోమలక్ష్మి తలపై కర్రలతో గట్టిగా కొట్టడంతో తలపగిలి అక్కడికక్కడే మృతిచెందింది.

ఆ తర్వాత మృతురాలి మంచాన్ని కొత్తగా నిర్మిస్తున్న ఇంటి గోడల మధ్య పెట్టి దుప్పటి కప్పి, కుమారుడి దశదిన కర్మ పనుల్లో నిమగ్నమయ్యారు. ఇది కక్షతోనే జరిగిన హత్యగా భావించిన పోలీసులు ఐనవోలు బ్రాందీషాపుతోపాటు రహదారుల్లో ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించగా ఆ రాత్రి నిందితులు అనిల్, రాజశేఖర్‌లు కలిసి మద్యం సేవించి వెళ్లినట్లు గుర్తించారు. వారిని విచారించగా హత్య తాలుకు వివరాలు వెల్లడించారు. మంత్రాల అనుమానంతోనే సోమలక్ష్మిని చంపినట్లు వారు ఒప్పుకోవడంతో నలుగురిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. రంజిత్ పరారీలో ఉన్నట్లు డీసీపీ తెలిపారు. కేసు దర్యాప్తులో ప్రతిభ చూపిన మామునూరు ఏసీపీ సతీష్‌బాబు, పర్వతగిరి సీఐ అనుముల శ్రీనివాస్, ఐనవోలు ఎస్సై నవీన్‌కుమార్‌తో పాటు సిబ్బందిని అభినందించారు.

మంగపేట ఎంపీడీవో మృతి


శ్రీధర్ (ఫైల్)

మంగపేట, జనవరి 3 : మంగపేట ఎంపీడీవో కర్నాటి శ్రీధర్ (57) మృతి చెందారు. రెండు రోజుల క్రితం ప్రజాపాలనలో విధుల్లో ఉండగానే అస్వస్థతకు గురైన ఆయన చికిత్స పొంది డిశ్చార్జ్ అయ్యారు. బుధవారం తెల్లవారు జామున కన్నుమూశారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమానికి ఎంపీడీవో శ్రీధర్ హాజరవుతున్నారు. డిసెంబరు 30న మండలంలోని కత్తిగూడెంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఒక్కసారిగా ఆయన అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనను ఉద్యోగులు ఇంటికి చేర్చారు. ఇదేక్రమంలో 31న ఒళ్లు నొప్పులతోపాటు తీవ్ర జ్వరంరావడంతో మాజీ ఎంపీటీసీ మండవ రామకృష్ణ ఆయనను ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం ములుగులోని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ మూడు రోజులపాటు వైద్యం పొంది డిశ్చార్జ్ అయిన ఎంపీడీవో బుధవారం తెల్లవారు జామున బాత్‌రూంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. గుండెనొప్పి వచ్చి తుది శ్వాస విడిచారు. ఖమ్మం జిల్లా మధిరకు చెందిన శ్రీధర్ మంగపేట ఎంపీడీవోగా కొనసాగుతున్నారు. గతంలో వెంకటాపూర్ (రామప్ప) ఎంపీడీవోగా పనిచేశారు. ఆయనకు భార్య గీత, కూతురు ప్రియాంక ఉన్నారు. మంగపేటలోని అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. కూతరు అమెరికాలో భర్త, ఇద్దరు పిల్లలతో ఉంటున్నారు. శ్రీధర్ మృతదేహాన్ని బంధువులు మధిరకు తరలించారు. కూతురు అమెరికా నుంచి రాగానే అక్కడే అంత్యక్రియలు జరగనున్నాయి. ఎంపీడీవో శ్రీధర్ మృతి పట్ల మంత్రి సీతక్క దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు సన్మానం

పర్వతగిరి, జనవరి 3 : వారం రోజుల వ్యవధిలో మండ ల పరిధిలోని రెండు ముఖ్యమైన కేసులలో ముగ్గురికి కఠిన కారాగార శిక్ష పడేలా కోర్టులో వాదించినందుకు గాను పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.సత్యనారాయణను హన్మకొండలోని ఆయన కార్యాలయంలో సీఐ శ్రీనివాస్, ఎస్సై వీరభద్రరావు లు బుధవారం ఘనంగా సన్మానించారు. ఆయనకు శాలువా కప్పి పుష్పగుచ్చాలు అందించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోర్టు డ్యూటీ ఆఫీసర్ పి.మోహన్, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఎం.వెంకటస్వామి పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి


నర్సంపేటలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

నర్సంపేట, జనవరి 3 : మహిళల విద్యను ప్రోత్సహించి అందుకోసం చరిత్రకపోరాటం నడిపిన ధీశాలి సావిత్రిబాయి పూలేకు భారతరత్న బిరుదును ప్రకటించాలని ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షుడు కల్లెపెల్లి ప్రణయదీప్, ఏబీఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ఏఎస్ఆర్ కళాశాలలో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి విద్యార్థులతో కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే గొప్ప సంఘ సంస్కర్త, విద్యావేత్త, కవయిత్రి అని కొనియాడారు. భారతదేశంలో మొట్టమొదటగా మహిళా పాఠశాలను స్థాపించి దళిత, అణగారిన వర్గాల విద్యార్థులకు విద్యనందించిన మహిళా ఉపాధ్యాయు రాలు సావిత్రిబాయి పూలే అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకుడు చింతం సిద్ధు, విద్యార్థిని, విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి యార ప్రశాంత్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గణేశ్, శివ, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి వంగల రాగసుధ ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలేజయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో చొప్పరి పద్మ, గోనెల అనిత, గుజ్జుల ప్రియాంక, చిందకింది వనమ్మ, జన్ను నీల, గణిపాక బిందు, అరుణ, షైదం పద్మ, ఎండి. ఫాతిమా, మేరుగు జయ తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని మల్లంపల్లి రోడ్‌లో బీసీ కులాల ఐక్యవేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆబోతు రాజు యాదవ్, మచ్చిక రాజుగౌడ్, బీసీ కులాల ఐక్యవేదిక సోషల్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు పైండ్ల గగన్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనం గా నిర్వహించారు.కార్యక్రమంలో ఇంజపూరి సుమన్, అంకాల సాగర్, కక్కర్ల జనార్ధన్ పాల్గొన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను బీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించారు. బీఎస్పీ నియోజ కవర్గ ఇంచార్జి గుండాల మదన్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు బుర్రి సాగర్, ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

• నర్సంపేటటౌన్ : నర్సంపేట పట్టణంలోని లీడ్ గ్రంథాలయంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ కవి, దర్శశయనం శ్రీనివాసాచార్య మాట్లాడుతూ స్త్రీ విద్యకై కృషి చేసిన మొదటి మహిళా ఉపాధ్యాయురాలు, అక్షర చైతన్య స్ఫూర్తి, సమాజాన్ని మార్చేందుకు చదువే ఆయుధమని తలచిన ఆదర్శమూర్తి సావిత్రిబాయి పూలే అని అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే అడుగు జాడల్లో నడుస్తు న్న కాసుల రవి కుమార్, శోభారాణి దంపతులు పలువురికి ఆదర్శంగానిలుస్తున్నారన్నారు. అనంతరం శ్రీనివాసాచార్యను రవికుమార్ దంపతులు, కవులు సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్‌టీచర్ వెంకట్రాం నర్సయ్య, అడ్వకేట్లు షేక్ రహిమొద్దిన్, యూనస్, ఎస్‌పీడీఎస్ ఎల్ ఉద్యోగి రమేష్, కవులు శిలా జగ దీష్, కేతిరెడ్డి యాకూబ్ రెడ్డి, గ్రంథాలయ నిర్వాహకు లు కాసుల శోభారాణి, రవికుమార్, మధు తదితరులు పాల్గొన్నారు.

• రాయపర్తి : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠ శాలలో బుధవారం ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం గారె కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయులైన సునీత, రోజారాణి, ఉమాదేవి, రోహిణి దేవి, స్వర్ణ, శోభలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విక్రమ, దేవేందర్, ప్రవీణ్‌రెడ్డి, ఎస్బీబీ శర్మ తదితరులు పాల్గొన్నారు.

• నల్లబెల్లి : మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో బుధవారం ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 193వ జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి విద్యార్థి నాయకుడు బొట్ల నరేష్‌తో పాటు ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళ్ళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

• పర్వతగిరి : సావిత్రిబాయి పూలే 193వ జయంతి ఉత్సవాలను మండలంలోని పలు గ్రామాల్లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య, మహిళా సంఘం నాయకురాలు పంజా కల్పన పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మోడల్ స్కూల్‌లో ఉస్మానియా యూనివర్సిటీ ఉద్యమ నాయకుడు నలిగంటి శరత్, స్వేరోస్ జిల్లాబాధ్యులు గారె జయరాజ్, ప్రజాసంఘాల నాయకులు వల్లం దాసు కుమార్, తాటికాయల నర్సయ్య, ఎన్నమనేని వెంకటేశ్వర్‌రావు, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

• చెన్నారావుపేట : ఎంతోమంది జీవితాల్లో వెలుగును నింపిన జ్యోతిరావు పూలే ఆశయసాధన కోసం కృషి చేయాలని మెపా రాష్ట్ర ప్రచార కార్యదర్శి పులి దేవేందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెండ్యాల కృష్ణా, నీరటి రాజు, యాదగిరి, పిట్టల కుమార్, దండు చిరంజీవి, చేరాలు. నిరంజన్, సాంబరాజు. నాగేష్, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

• నెక్కొండ : భారతదేశ మొదటి మహిళ ఉపాధ్యాయురాలు సామాజిక సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే 193 జయంతి ఉత్సవాలను నెక్కొండలోని అంబేడ్కర్ భవనంలో బుధవారం దళిత సంఘాల నాయకులు ఘనంగా జరిపారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి వేడుకలను జరిపారు. మహిళలను విద్యావంతులుగా తయారుచేసిన పూలే సేవలను మరవలేమన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు యాదగిరి, సూర్యారావు, చెన్నకేశవులు, శ్యాం, మల్లయ్య, వనిత, రవీందర్, శ్వేత, రజిత, కిషన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను విస్మరించిన గత ప్రభుత్వం

• ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి


నర్సంపేటలో మహిళలకు అభయహస్తం దరఖాస్తులను అందజేస్తున్న ఎమ్మెల్యే దొంతి

నర్సంపేట, జనవరి 3 : తెలంగాణ ఉద్యమంలో పాల్గొని జైలు జీవితం గడిపిన ఉద్యమకారులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. పట్టణంలోని 13, 14, 15, 16 వార్డుల్లో బుధవారం ప్రజాపాలన గ్రామ సభను నిర్వహించారు. అభయహస్తం దరఖాస్తులను ఆయన మహిళలకు పంపిణీ చేశారు. కార్యక్రమ అనంతరం సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి ఎమ్మెల్యే నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఆడపిల్లల చదువు కోసం నిరంతరం పాటుపడిన మహిళా చైతన్యమూర్తి అని కొనియాడారు. సావిత్రి బాయి పూలే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని మహి ళలు ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ నాయిని వెంకటస్వామితో పాటు అధికారులు. సిబ్బంది, ఆయా వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

• నర్సంపేట టౌన్: రాష్ట్ర ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, అందుకోసమే ప్రజాపాలనను ప్రజల వద్దకు తీసుకొచ్చిందని నర్సంపేట ఎమ్మెల్యే మాధవరెడ్డి అన్నారు. నర్సంపేట మండలంలోని మహేశ్వరం, ఆకులతండ, ఇటుకాల పల్లి, గురిజాల గ్రామాల్లో బుధవారం జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రజల నుంచి ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

• నల్లబెల్లి: అర్హులైన ప్రజలందరికీ ఆరు గ్యారంటీలను ఇస్తామని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి అన్నారు.బుధవారం మండలంలోని రుద్రగూడెం, రంగాపురం, కొండాపూర్ గ్రామాల్లో ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించారు. అయితే రుద్రగూడెం ప్రజాపాలన గ్రామ సభకు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి హాజరై మాట్లాడారు. దరఖాస్తు ఫారాలు ప్రజలకు అందుబాటులోనే ఉంటాయని, ప్రజలెవ్వరు అధైర్యపడొద్దన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బొనగాని రాజేష్, ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంపీవో కూచన ప్రకాష్, సూపరిండెంట్ అమ్మద్ అలీ, నాయకులు చిట్యాల తిరుపతిరెడ్డి, మాలోతు రమేష్, మామిండ్ల రాజిరెడ్డి,అజ్మీర తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

• ఖానాపురం:ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను లబ్ధిదారులకు అందించేందుకు ప్రజాపాలన సభలలో దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పిలుపు నిచ్చారు. మండలంలోని అశోక్‌నగర్‌లో బుధవారం ప్రజాపాలన గ్రామసభ నిర్వహించగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ గొర్రె కవిత, తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీవో సుమన వాణి పాల్గొన్నారు.

• దరఖాస్తులు చేసుకోండి : ఉషాదయల్

నెక్కొండ: పేదల సంక్షేమంకోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాల ద్వార లబ్ధి పొందుటకు అర్హులు దరఖాస్తులను చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి జేడీఏ ఉషాదయల్ అన్నారు. మండలంలోని గొట్లకొండ గ్రామంలో బుధవారం నిర్వహించిన ప్రజా పథం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మండలంలోని రెడ్లవాడ, బొల్లికొండ గ్రామాల్లో నిర్వహించిన సభల్లో ప్రజల నుంచి 2535 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సభల్లో టీం లీడర్లు తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎవో నాగరాజు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు శ్రీధర్, శ్రీలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

• కొనసాగిన ప్రజా పాలన గ్రామ సభలు

చెన్నారావుపేట : మండలంలోని బోడమాణిక్యం తండా, పదహారుచింతల్ తండా, బాపునగర్‌లతో పాలు పలు గ్రామాల్లో బుధవారం ప్రజా పాలన గ్రామ సభలు కొనసాగాయి. జడ్పీ సీఈవో రాంరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 6 వరకు కొనసాగుతుందన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరు దరఖాస్తులను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ బాలకృష్ణా, ఎంపీడీవో భారతి, తహశీల్దార్ ఫణికుమార్, ఎంపీవో శ్రీధర్‌రాజు, ఏఈ మంగీలాల్, సూపర్ వైజర్ మంజుల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

• ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

దుగ్గొండి: ప్రభుత్వ పథకాలను ప్రతీ అర్హుడు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రవిచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని తిమ్మంపేట, నాచినపల్లి, మహ్మదాపురం, లక్ష్మీపురం, గ్రామాల్లో బుధవారం ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. తిమ్మంపేటలో జరిగిన గ్రామ సభలో తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పొందుటకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మోడెం విద్యాసాగర్, తోట్ల నీలవేణి, సురేశ్, పెండ్యాల మమతరాజు, కార్యదర్శులు అధికారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు కార్పొరేటర్ల గుడ్‌బై

(5వ పేజీ తరువాయి)

తెలియచేశారు. అనంతరం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి నేతృత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. వీరితో ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. పార్టీలోకి చేరడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియచేశారు. తామంతా నిర్బంధాన్ని వీడామని, స్వేచ్ఛాయుత, ప్రజా సేవాభావ రాజకీయ ప్రపంచంలోకి చేరడం ఆనందంగా ఉందని బీఆర్ఎస్ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు తదితరులు తమ మనోగతాన్ని వెలిబుచ్చారు.

త్వరలో తూర్పు, వర్ధన్నపేట కార్పొరేటర్లు

బీఆర్ఎస్‌తో పాటు బీజేపీకి చెందిన పలువురు కార్పొరేటర్లు కాంగ్రెస్‌లోకి వచ్చేందుకు రెడీగా ఉన్నారు. పశ్చిమ కార్పొరేటర్లతో పాటే తూర్పు, వర్ధన్నపేట కార్పొరేటర్లు కూడా కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రణాళికలు జరిగాయి. అయితే మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ, సీనియర్ నాయకుడు కొండా మురళి ఈ వ్యవహారాన్ని వాయిదా వేసినట్లు సమాచారం. అదను చూసి అధిక సంఖ్యలో బీఆర్ఎస్ కార్పొరేటర్లను కాంగ్రెస్‌లోకి ఆహ్వానించే వ్యూహంతో కొండా మురళి పావులు కదుపుతున్నట్లు సమాచారం. అదే విధంగా వర్ధన్నపేట కార్పొరేటర్లకు కూడా ఎమ్మెల్యే నాగరాజుతో కలిసి కొండా మురళి చేరికల వ్యూహాన్ని పన్నినట్లు సమాచారం.

స్పందించని కార్పొరేటర్లు

బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు వరంగల్ పశ్చిమ, తూర్పు మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, నన్నపునేని నరేందర్, మేయర్ గుండు సుధారాణితో పాటు ఎమ్మెల్సీ బండా ప్రకాశ్ తదితరులు బీఆర్ఎస్ కార్పొరేటర్లను సంప్రదించి నిలువరించే ప్రయత్నాలు చేసినట్లు తెలిసింది. అయితే ఈ యత్నాలకు స్పందించకుండా మంగళవారం రాత్రే హైదరాబాద్‌లో బీఆర్ఎస్ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు మకాం వేసినట్లు తెలిసింది. బుధవారం ఉదయం కూడా బీఆర్ఎస్ నేతలకు టచ్‌లోకి రాకుండా, ఫోన్లు కూడా ఎత్తకుండా ఉన్నట్లు సమాచారం.

కాంగ్రెస్‌లోకి 'తూర్పు' కార్పొరేటర్లు?

(5వ పేజీ తరువాయి)

ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరేందుకు ముందు వరుసలో ఉన్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ కార్పొరేటర్లు రహస్యంగా సమావేశాలు ఏర్పాటు చేసుకుంటున్న నేపథ్యం కూడా కాంగ్రెస్‌లో చేరేందుకు సన్నాహక సమావేశాలనే ఊహాగానాలు ప్రచారంలో ఉన్నాయి. బీఆర్ఎస్ కార్పొరేటర్లు సైతం రహస్య సమావేశాల్లో పాల్గొంటూ అక్కడ జరిగిన చర్చలను గోప్యంగా ఉంచుతుండటంతో కార్పొరేటర్లు పార్టీ మారుతున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది.

ఓటమితో బీఆర్ఎస్ డీలా..

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పాలవ్వడంతో వరంగల్ తూర్పులో నాయకత్వం ఒక్క సారిగా డీలా పడింది. పార్టీలోని నాయకులను కట్టడి చేయడంలో తూర్పు బీఆర్ఎస్ నాయకత్వం ఫెయిల్ అయ్యింది. దీంతో ఆ పార్టీలో ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా తయారవడంతో ఆ పార్టీ కార్పొరేటర్లలో నిర్లిప్తత ఏర్పడింది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పటి ధీమా నాయకుల్లో కనపడక పోవడంతో కార్పొరేటర్లలో ఆందోళన మొదలైంది. పార్టీ పూర్తి స్థాయిలో పడిపోతుందనే ఆలోచనతో వారు కాంగ్రెస్‌లో చేరేందుకు మొగ్గు చూపుతున్నట్లు చెబుతున్నారు. పార్టీ అధిష్టానం సైతం డీలా పడిపోవడంతో ఇక పార్టీ నిలదొక్కుకుంటుందో లేదో ననే భయాందోళనల్లో బీఆర్ఎస్ కార్పొరేటర్లు కొట్టుమిట్టాడుతున్నారు. దీంతో వారు అనివార్యంగా అధికారంలో ఉన్న కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. మరో రెండేళ్లు అధికారంలో ఉండాల్సిన వారు తప్పనిసరి నిర్ణయం తీసుకుంటే తప్ప అధికారంలో ఉండే పరిస్థితి లేదని, లక్షల రూపాయలు ఖర్చు పెట్టి కార్పొరేటర్‌గా గెలిస్తే ఇప్పటివరకు సంపాదనే లేదని, కనీసం కాంగ్రెస్‌లో చేరితేనైనా కాంట్రాక్టుల్లో వచ్చే పర్సంటేజీలతోనైనా కాస్త వెనుకేసుకోవచ్చుననే ఆలోచనతో వారు కాంగ్రెస్‌లో చేరుతున్నారని కొంత మంది బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు.

కేటీఆర్ అపాయింట్‌మెంట్ దొరక్క వెనక్కి..

కాంగ్రెస్‌లో చేరేందుకు రంగంసిద్ధం చేసుకున్న పలువురు కార్పొరేటర్లు చివరి మాటగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసేందుకు హైదరాబాద్‌కు వెళ్లినట్లు తెలిసింది. అయితే అక్కడ కేటీఆర్ అపాయింట్‌మెంట్ దొరక్కపోవడంతో నిరాశతో వెనక్కి వచ్చినట్లు తెలుస్తోంది. కేటీఆర్ కలిసినా కలవకపోయినా కాంగ్రెస్‌లో చేరాల్సిందేనని మెజారిటీ బీఆర్ఎస్ కార్పొరేటర్లు అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు సమాచారం.

స్పష్టత లేని బీఆర్ఎస్ కార్పొరేటర్లు

కాంగ్రెస్‌లో చేరుతున్నారని కొంత మంది బీఆర్ఎస్ కార్పొరేటర్లను అడిగితే స్పష్టమైన సమాధానం చెప్పడం లేదు. కొంత మంది మాత్రం కాంగ్రెస్‌లో ఎవరూ చేరడం లేదని, బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నామని చెబుతున్నారు. అయితే రహస్యంగా సమావేశాలు ఎందుకు ఏర్పాటు చేసుకుంటున్నారని అడిగితే మాత్రం వారు సమాధానం దాట వేస్తున్నారు. మొత్తంగా 21 మంది బీఆర్ఎస్ కార్పొరేట్లు కాంగ్రెస్‌లో చేరుతున్నారనే ప్రచారం వరంగల్ తూర్పులో వ్యాపించడంతో ఇప్పుడు నియోజకవర్గం అంతా కార్పొరేటర్ల ఫిరాయింపుపైనే చర్చ జరుగుతోంది.

హరీష్‌రావును కలిసిన అరూరి


మాజీ మంత్రి హరీష్‌రావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్

వర్ధన్నపేట, జనవరి 3 : మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టి.హరీష్ రావును బుధవారం పలువురు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వరంగల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కేటీఆర్‌ను కలిసిన పెద్ది దంపతులు


కేటీఆర్‌కు బొకే అందజేస్తున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి, పెద్ది స్వప్న

నర్సంపేట, జనవరి 3 : హైదరాబాద్‌లోని తన నివాసంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీ ఆర్‌ను బుధవారం నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆయన సతీమణి పెద్ది స్వప్నలు మర్యాద పూర్వకంగా కలిశారు. కేటీఆర్‌కు బొకేను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

లారీ ఢీకొని గొర్రెల మృతి

వర్ధన్నపేట, జనవరి 3: లారీ ఢీకొని రెండు గొర్రెలు మృతి చెందిన ఘటన బుధవారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. వర్ధన్నపేట జాతీయ రహదారిపై వరంగల్ వైపు వేగంగా వస్తున్న లారీ రోడ్డుపై వెళ్తున్న గొర్రెలను ఢీకొట్టింది. ఈ ఘటనలో రెండు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. లారీ డ్రైవర్ అజాగ్రత్తతోనే ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు గొర్రెల యజమాని పేర్కొన్నాడు.

కుంటలో పడి వృద్ధుడి గల్లంతు

వర్ధన్నపేట రూరల్, జనవరి 3 : చేపల వేటకు వెళ్లిన వృద్ధుడు ప్రమాదవశాత్తు కుంటలో పడి గల్లంతైన సంఘటన మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. దమ్మన్నపేటకు చెందిన బెజ్జం వెంకటనర్సు (68) మంగళవారం సాయంత్రం ఇంటి నుండి చేపల వేట కోసం వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు గాలించగా గ్రామ సమీపంలోని భీముని కుంట వద్ద వృద్ధుని బట్టలు కనిపించాయి. దీంతో వృద్ధుడు కుంటలో పడినట్లుగా కుటుంబ సభ్యులు నిర్ధారించుకుని పోలీసులకు సమాచారం అందించారు. వర్ధన్నపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది, గజ ఈతగాళ్లు వృద్ధుడి ఆచూకీ కోసం కుంటలో గాలిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వృద్ధుడి బట్టలు కుంట వద్ద లభ్యం కావడంతో గాలింపు చర్యలు చేపట్టామని తెలిపారు. వర్ధన్నపేట ఫైర్‌స్టేషన్ ఎస్ఐ భద్రయ్య ఆధ్వర్యంలో సైతం వారి సిబ్బంది గాలింపులో చర్యల్లో పాల్గొన్నారు. కెమెరాలను నీటిలో వేసి వృద్ధుని కోసం గాలించారు. వృద్ధునికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

మౌనికకు రాష్ట్ర స్థాయి సావిత్రిబాయి పూలే అవార్డు

వర్ధన్నపేట రూరల్, జనవరి 3 : మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన చీపురు మౌనికకు రాష్ట్రస్థాయి సావిత్రిబాయి పూలే అవార్డు అందించారు. బుధవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర బీసీ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలందించిన మహిళలకు అవార్డులు ప్రదానంచేశారు. ఈ సందర్భంగా సాంస్కృతి కళా రంగంలో విశేష సేవలందిస్తున్న చీపురు మౌనికకు అవార్డు దక్కింది.

పాలకుర్తికి హనుమాండ్ల అండ

రాయపర్తి, జనవరి 3 : పాలకుర్తి నియోజకవర్గానికి హనుమాండ్ల కుటుంబం అండగా నిలవడం సంతోషంగా ఉందని మండల కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, యాదగిరి, గ్రామ అధ్యక్షుడు తీగల సాయిలు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో డాక్టర్ హనుమాండ్ల రాజేందర్ రెడ్డి జన్మదినం సందర్భంగా కేక్ కట్‌చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ నియోజకవర్గానికి చెందిన రాజేందర్‌రెడ్డి, ఝాన్సీరెడ్డిని వివాహం చేసుకుని అంచెలంచెలుగా ఎదిగి అమెరికాలో స్థిరపడి నియోజకవర్గానికి సేవ చేస్తున్నాడని గుర్తు చేశారు. ఇప్పుడు తన కోడలు యశస్వినీరెడ్డి పాలకుర్తికి ఎమ్మెల్యేగా రావడం గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణ, సాయిలు, చేరాలు పాల్గొన్నారు.

ఇంటింటికి అయోధ్య రామయ్య అక్షింతలు పంపిణీ

నర్సంపేట, జనవరి 3 : పట్టణంలోని నెక్కొండ రోడ్‌లోని 9వ వార్డులో బుధవారం అయోధ్య రామయ్య అక్షింతలను వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఇంటింటికి పంపిణీ చేశారు. అయోధ్యలో సీతారాములను పూజించిన అంక్షింతలు పట్టణంలోనిరామాలయానికి చేరాయి. ఆలయం నుంచి అయోధ్య రామయ్య ఆలయం నుంచి స్వీకరించిన అక్షింతలు, సీతారాముల చిత్రపటం ఆయోధ్య రామయ్య ఆహ్వాన పత్రం పాటలు పాడుతూ ఇంటింటికి అక్షింతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్త రాజేందర్, మణెమ్మ, తక్కళ్ళపల్లి జయమ్మ, ఉగ్గిడి శ్యామల, చిన్నారి ఉగ్గిడి ఆధ్య, సక్కుబాయి, రమ,ఐలయ్య, రమేశ్, భక్తులు పాల్గొన్నారు.

• చెన్నారావుపేట : శ్రీరామ జన్మభూమి పూజిత అక్షింతల వితరణ కార్యక్రమంలో బుధవారం ఇంటింటికి అందించారు. ఈ సందర్భంగా విశ్వహిందు పరిషత్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి నందాల చందర్‌బాబు మాట్లాడుతూ ఈ నెల 22న అయోధ్యలో శ్రీ బాల రాముని విగ్రహ ప్రతిష్ట ఉందని, ఆదే రోజు సాయంత్రం ప్రతీ ఒక్కరూ ఇంటికి 5 దీపాల చొప్పున వెలిగించాలన్నారు. అనంతరం వితరణ సమావేశానికి వచ్చిన కార్యకర్తలను కేతిరి లక్ష్మీ సమ్మిరెడ్డి దంపతులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మురళీధర్, శివకుమార్, చిప్ప బీమ్‌రాజ్, కేతిరి సమ్మిరెడ్డి, మంచాల కొమ్మాలు, చాగంటి రాజు, పుట్ట మణికంఠ, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

అక్షింతల వితరణ కమిటీ మండల అధ్యక్షుడిగా మల్లికార్జున్

పర్వతగిరి, జనవరి 3 : శ్రీరామ జన్మభూమి పూజిత అక్షింతల వితరణ కమిటీ మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన చింతకుంట్ల మల్లికార్జున్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు విశ్వహిందూ పరిషత్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి నందాల చందర్‌బాబు అన్నారు. ధర్మకర్తలుగా సునీల్‌రావు, సుభాషిణి, రంగారావు, ప్రతాప్‌రెడ్డి, రాజు యాదవ్, రామ్మోహన్‌లను నియమించినట్లు తెలిపారు.